



# ప్రజా వాయిస్

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 22 | ఎడిటర్: మేనం శ్యామ్ | సోమవారం 10-08-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

బోనం... తెలంగాణ ఆత్మగౌరవం
మట్టివాసనలో మమకారం,
మల్లెల సువాసనలో పరిమళం...
డప్పుల దరువులో దరహాసం,
తెలంగాణ గుండెల్లో బోనాల సందడి!
అమ్మవారికి బోనం ఎత్తి,
భక్తితో అడుగులు వేసే వేళ...
పసుపు కుంకుమలతో అలంకరించి,
బోనాన్ని తలపై మోసుకుంటూ...
తల్లిని తలచే ప్రతి హృదయం,
భక్తితో పరవశించే పుణ్యక్షణం!
పోతురాజు ఉరుముల అడుగుల్లో,
డప్పుల మోతలో ఉత్సాహం...
గొప్ప సంస్కృతికి ప్రతిరూపంగా,
తెలంగాణ జానపద వైభవం!
పల్లె నుంచి పట్నం దాకా,
ఒక్కటయ్యే జనహృదయాల పండుగ...
తరతరాలుగా సాగుతున్న సంప్రదాయం,
పచ్చని పంటలు, పసిడి జీవితాలు
ప్రతి కుటుంబంలో వెల్లివిరియాలి!

— అరుణ్ రెడ్డి పన్నాల,
వికారాబాద్.




# జీ.వో 16 కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణలో కుంభకోణం?

- సంవత్సరం క్రితం చెప్పిన ప్రజా వాయిస్
- ప్రక్షాళన షురూ..ఫేక్ సర్టిఫికెట్లతో 400 కు పైగా లెక్చరర్లు ఉన్నట్లుగా అంచనా..?
- నోటిఫికేషన్ లేకుండా..అక్రమంగా జాయిన్ అయినవారు 1000 కి పైగా?
- ముడుపుల్లో తేడా వచ్చిందా.. ఆ ఉద్యోగ సంఘం నాయకుడికి కోపం వచ్చిందా?
- ఇప్పుడు 35 మందే.. సప"రేటు"గా మాట్లాడకపోతే మిగతావారు బయటకు వస్తారని భయపెడుతున్న ఉద్యోగ సంఘం నాయకుడు?
- ఒక్కో నకిలీ ఉద్యోగి నుండి ఐదు నుంచి పది లక్షలకు బేరం..?
- ఇవ్వని వాళ్లు బయటికి.. ఇచ్చిన వాళ్లు లోపల…?
- ముందు టార్గెట్ గా ఇతర రాష్ట్రాల నకిలీ పీజీ సర్టిఫికెట్లు సమర్పించిన ఉద్యోగులు?
- తర్వాతి టార్గెట్ తెలంగాణలో అక్రమంగా జాయిన్ అయిన ఉద్యోగులేనా?
- నాలుగుసార్లు ఇంటర్ బోర్డు రూల్స్ ప్రకారం వెరిఫికేషన్ జరిగిన నకిలీలను పట్టుకోకపోవడంతో అనుమానం?
- ఒకేషనల్ కాంట్రాక్ట్ లెక్చరర్ లకు నోటిఫికేషన్ లేదన్న సాకుతో తీరని అన్యాయం



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** గత సంవత్సరం ఇదే నెలలో ప్రజా వాయిస్ "జీవో 16 నిబంధనలు తుంగలో.. ఫేక్ అధ్యాపకులు ఉద్యోగాలలో" అనే కథనం ను ప్రచురించింది, అందులో కాంటాక్ట్ లెక్చర్స్ ఫేక్ సర్టిఫికెట్ గురించి, ఉద్యోగ సంఘాల ద్వారా, రాజకీయ నాయకుల పైరవీల ద్వారా నకిలీ ఉద్యోగులు తమ యొక్క ఉద్యోగాలను కాపాడుకునే ప్రయత్నంలో ఎంతైనా ఇచ్చేందుకు రెడీగా ఉన్నారని.. దీనికి ఇంటర్ బోర్డులో, ఆర్జెడి కార్యాలయాల్లో కీలక అధికారులు సహకరిస్తున్నారని, వాటికి ప్రిన్సిపాల్, డి.ఐ.ఈ.ఓ ల వెరిఫికేషన్ లో లోపాలు ఉన్నాయని ముందే హెచ్చరించిన ప్రజా వాయిస్.. సంవత్సరం తర్వాత


ప్రజా వాయిస్

జీ.ఓ 16 నిబంధనలు తుంగలో...

ఫేక్ అధ్యాపకులు ఉద్యోగాలలో..

- నకిలీల వెరిఫికేషన్ కు సహకరిస్తున్న కొందరు ప్రిన్సిపాల్ లు?
- 2014 వరకు పూర్తిగా కాంట్రాక్ట్ బాండ్ లేకపోయిన కొందరు కాంట్రాక్ట్ లెక్చరర్స్ రెగ్యులర్
- ఓ మంత్రి సన్నిహితుని ద్వారా ఫేక్ ల బేరసారాలు?
- ఇంటర్ బోర్డ్ లో కొందరు కీలక అధికారులకు ముడుపులు?

మిగతా 2లో...

ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న నకిలీ ఆధ్యాపకుల వ్యవహారం ఇందుకు నిదర్శనం.నకిలీ సర్టిఫికెట్లతో 400 కు పైగా లెక్చరర్ లు ఉన్నట్లుగా, నోటిఫికేషన్ లేకుండా అక్రమంగా జాయిన్ అయినవారు 1000 కి పైగా ఉన్నట్లుగా ఇంటర్ బోర్డు కార్యాలయ అధికారులు, ఉద్యోగ సంఘ నాయకుడు లిస్టు తయారు చేసుకున్నట్టుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. నేను చెప్పిందే వేదం అంటూ.. కాంట్రాక్టు పద్ధతిలో రెగ్యులర్ అయిన వాళ్లందరూ నేను చెప్పిందే వినాలంటూ ఆ ఉద్యోగ సంఘ నాయకుడు హుకుం జారీ చేసినట్లు చెవులు కోరుకుంటున్నారు. ఎవరైతే ఫేక్ పీజీ సర్టిఫికెట్లతో లెక్చరర్ గా చలామణి అవుతున్నారో, అక్రమంగా జాయిన్ అయ్యారో వాళ్ళందరికీ ఫోన్ చేసి మాట్లాడగా దానికి వాళ్లు ససేమీరా అనడంతో.. ఆ ఉద్యోగ సంఘం నాయకుడికి కోపం రావడంతో..

మిగతా 2లో

# మూడు సింహాల పహారా.. తెలంగాణకు కొత్త భరోసా..

- చెరువుల కన్నీళ్లు తుడుస్తున్న హైడ్రా
- కబ్జాదారులపై ఏవీ రంగనాథ్ ఉక్కుపాదం
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా?
- కల్తీ రాయుళ్లపై సజ్జనార్ కొరడా
- పేదల బియ్యానికి కాపలా.. రేషన్ మాఫియా ఆట కట్టిస్తున్న స్టీఫెన్ రవీంద్ర
- డ్రోన్ నుంచి డిజిటల్ ఫిర్యాదుల దాకా.. టెక్నాలజీతో అక్రమాలపై నిఘా
- అధికారులకు రేవంత్ ఫ్రీహ్యాండ్
- ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా ట్రిపుల్ యాక్షన్.



**ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం హైదరాబాద్.** పాలన అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు.. ఆ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయగల అధికార యంత్రాంగం ఉండాలి. రాజకీయ సంకల్పానికి పరిపాలనా సామర్థ్యం తోడైతే అక్రమాలపై ఉక్కుపాదం మోపడం సాధ్యమవుతుంది. ప్రస్తుతం

మిగతా 2లో

# మృత్యువుతో పోరాడి ఓడిన వైద్య విద్యార్థిని

- ర్యాష్ డ్రైవింగ్‌కు వైద్య విద్యార్థిని ప్రియాంక బలి
- మద్యం మత్తులో కారుతో మూడుసార్లు ఢీ.. కిమ్స్‌లో బ్రెయిన్‌డెడ్
- భవిష్యత్తు వైద్యురాలిని బలిగొన్న నిర్లక్ష్యపు డ్రైవింగ్
- ప్రమాదం కాదు.. హత్య కేసు పెట్టాలి.. తండ్రి ఆవేదన

2లో





# ఆకాశం కరుణించాలి.. సాగర్ నిండాలి..

- నాగార్జునసాగర్‌లో నేడు వరుణ యాగం
- కుటుంబ సమేతంగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరువిజయ్ విహార్‌లో విస్తృత ఏర్పాట్లు
- 108 మంది రుత్వికులతో మహా క్రతువు
- పాస్ ఉన్నవారికే ప్రవేశం



**ప్రజా వాయిస్,నాగార్జునసాగర్.**రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు, నదులు నిండాలనే ఆకాంక్షతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ విజయ్ విహార్ ఆవరణలో కృష్ణా నది ఒడ్డున సోమవారం నిర్వహించనున్న వరుణ యాగానికి విస్తృత ఏర్పాట్లు పూర్తయ్యాయి. యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ మహా క్రతువుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా హాజరుకానుండగా, పలువురు మంత్రులు,

మిగతా 2లో

# యాదాద్రిలో రూ.54 కోట్ల 'డ్రగ్ ల్యాబ్' గుట్టురట్టు

- యాదాద్రి గడ్డపై మెఫ్రెడ్రోన్ మాఫియా కలకలం
- కొండమడుగు 'వెటర్నరీ ల్యాబ్స్'లో మూడు రోజులు తయారీ
- నాగ్‌పూర్‌కు తరలింపునకు పన్నాగం
- 27 కిలోల మెఫ్రెడ్రోన్ స్వాధీనం.. నలుగురు అరెస్టు
- కీలక సూత్రధారులు నలుగురు పరారీ
- రియాక్టర్, సెంట్రిఫ్యూజ్ సహా భారీగా పరికరాలు పట్టివేత

2లో



# హిందువులారా.. జెన్‌జీ బాటలో గళం విప్పండి

- సనాతన ధర్మం.. హిందూత్వ రక్షణకు యువతే ముందుండాలి: బండి సంజయ్
- బోనాలకు రూ.20 కోట్లు.. రంజాన్‌కు రూ.33 కోట్లా?
- రాష్ట్ర ప్రభుత్వంపై ఫైర్
- 150 హైడ్రా పోస్టులకు వేలాది మంది
- తెలంగాణలో నిరుద్యోగం తాండవానికి ఇదే నిదర్శనం
- ఫీజు రీయింబర్స్‌మెంట్ నుంచి రూ.2,500 సాయం వరకు
- కాంగ్రెస్ హామీలపై నిలదీత

2లో



# డేటింగ్ పేరుతో డేంజర్ గేమ్


- అందంతో వల.. రూ.6 కోట్లతో హనీ జంప్
- డేటింగ్ యాప్‌లే అడ్డా, అందమైన ప్రొఫైళ్లతో ట్రాప్
- చాటింగ్, డేటింగ్, రహస్య వీడియోలు, ఆపై బ్లాక్‌మెయిల్
- ప్రముఖులు, వ్యాపారులే టార్గెట్, పరువు తీస్తామంటూ కోట్ల వసూళ్లు
- ఎదురు తిరిగితే లైంగిక వేధింపుల కేసులంటూ బెదిరింపులు
- హైకోర్టు లాయర్ ఫిర్యాదుతో బట్టబయలు, యూపీ యువతి కోసం పోలీసుల గాలింపు



**ప్రజా వాయిస్,హైదరాబాద్ డెస్క్:** అందమైన ప్రొఫైల్ తీయటి మాటలు డేటింగ్ యాప్‌లో పరిచయం ఆపై ఏకాంత భేటీ అక్కడ రహస్యంగా వీడియోలు, ఫొటోలు తీసి వాటితో బ్లాక్‌మెయిల్ చేస్తూ కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యూపీ యువతి వ్యవహారం సంచలనం రేపుతోంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పల్లవి సింగ్ డేటింగ్ యాప్‌లను వేదికగా చేసుకుని పలువురు పురుషులను హనీట్రాప్‌లోకి దించినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. బాధితుల నుంచి సుమారు రూ.6 కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

### హాయ్ తో మొదలు.. బ్లాక్‌మెయిల్‌తో ముగింపు

ప్రముఖ డేటింగ్ యాప్‌లలో ఆకర్షణీయమైన నకిలీ



ప్రొఫైళ్లు సృష్టించి పురుషులతో పరిచయం పెంచుకునేదని పోలీసులు చెబుతున్నారు. చాటింగ్ ద్వారా నమ్మకం కలిగించి.. అనంతరం ఏకాంతంగా కలిసేలా చేసేదని సమాచారం. ఆ సమయంలో బాధితులకు తెలియకుండా వీడియోలు, ఫొటోలు రికార్డు

మిగతా 2లో

# మూడు సింహాల పహారా.. తెలంగాణకు కొత్త భరోసా..

**మొదటి పేజీ తరువాయి**

తెలంగాణలో కొన్ని కీలక విభాగాల్లో కనిపిస్తున్న దూకుడు ఇదే అంశాన్ని మరోసారి చర్చకు తెస్తోంది. ముఖ్యంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, సివిల్ సప్లైస్ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర పనితీరు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక దృష్టిని ఆకర్షిస్తోంది.వీరి శాఖలు వేరు.. సమస్యలు వేరు.. విధానాలు వేరు.. కానీ లక్ష్యం మాత్రం ఒకటే. ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే అక్రమ వ్యవస్థలను గుర్తించడం.. వాటిపై చట్టబద్ధంగా చర్యలు తీసుకోవడం.. ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచడం. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు అధికారులను మూడు సింహాలు గా అభివర్ణించడం అతిశయోక్తి కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**కబ్జాలపై హైడ్రా..**
**కాలభైరవుడిలా ఎవి రంగనాథ్.**

హైదరాబాద్ నగరానికి చెరువులు, నాలాలు కేవలం నీటి వనరులు మాత్రమే కాదు.. నగర పర్యావరణ వ్యవస్థకు అవి వెన్నెముక. వాటిని ఆక్రమించి నిర్మాణాలు చేపడితే దాని ప్రభావం ఒక్క ప్రాంతానికే పరిమితం కాదు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరదల రూపంలో మొత్తం నగరమే మూల్యం చెల్లించాల్సి వస్తుంది.ఈనేపథ్యంలో హైడ్రా ఏర్పాటు అనంతరం చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో ఆక్రమణలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే ప్రక్రియ వేగం పుంజుకుంది.పలుకుబడి ఉందా..ఆర్థిక బలం ఉందా..రాజకీయ పరిచయాలున్నాయా..అన్నది కాకుండా నిబంధనలు ఉల్లంఘించారా లేదా అన్నదే ప్రధాన అంశంగా హైడ్రా బలపడుతోంది.ఇక్కడ మరో ముఖ్యమైన మార్పు సాంకేతికత వినియోగం. శాటిలైట్ మ్యాపింగ్, డ్రోన్ సర్వేలు, డిజిటల్ రికార్డులు వంటి ఆధునిక పద్ధతుల ద్వారా ఆక్రమణలను గుర్తించే ప్రయత్నం జరుగుతోంది. దీంతో క్షేత్రస్థాయి పరిశీలనకు సాంకేతిక ఆధారాలు జతవుతున్నాయి.ఇది కేవలం బుల్డోజర్లతో నిర్మాణాలు తొలగించే ప్రక్రియగా చూడటం కంటే.. భవిష్యత్ హైదరాబాద్‌ను వరద ముప్పు నుంచి కాపాడే దీర్ఘకాలిక చర్యగా చూడాల్సిన అవసరం ఉంది.

**ప్రజారోగ్యంతో ఆటలాడితే ఊరుకునేది లేదు.. :వి.సి. సజ్జనార్.**

ఆహార కల్తీ అనేది సాధారణ నేరం కాదు. అది నేరుగా ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. కల్తీ పదార్థాలు మార్కెట్లోకి వస్తున్నా పట్టించుకోకుండా వదిలేస్తే దాని మూల్యం సమాజమే చెల్లించాల్సి ఉంటుంది.ఈనేపథ్యంలో హైదరాబాద్‌లో కల్తీ ఆహార దందాలపై పోలీసుల దృష్టి పెరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆధ్వర్యంలో కల్తీ పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాలపై నిఘా పెంచుతున్నారు.కల్తీ నెయ్యి, పాలు, మసాలా పదార్థాలు, నాణ్యత లేని మాంసం తదితర అంశాలపై తనిఖీలు, దాడులు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.ఇక్కడ కూడా డిజిటల్ టెక్నాలజీ కీలకంగా మారుతోంది. సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమాచారాన్ని అధికారులు పరిశీలించి అవసరమైన చోట క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టే విధానం ఆధునిక పోలీసింగ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది.ప్రజల ఫిర్యాదు పోలీస్ స్టేషన్ గడప దాటకుండానే డిజిటల్ వేదికల ద్వారా అధికారుల దృష్టికి చేరడం.. దానిపై స్పందన రావడం ప్రజా విశ్వాసాన్ని పెంచే అంశమే.

**పేదల బియ్యంపై కన్నేస్తే..**
**సివిల్ సప్లైస్ నిఘా..ఎం. స్టీఫెన్ రవీంద్ర.**

రేషన్ బియ్యం అక్రమ రవాణా దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్య. పేదలకు అందాల్సిన సబ్సిడీ బియ్యం పక్కదారి పట్టి నల్లబజారుకు చేరితే అది కేవలం ప్రభుత్వానికి ఆర్థిక నష్టం కాదు.. ఒక పేద కుటుంబానికి దక్కాల్సిన ఆహార భద్రతను దోచుకోవడమే.ఈవ్యవస్థపై సివిల్ సప్లైస్ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర ఆధ్వర్యంలో నిఘా వ్యవస్థను పటిష్టం చేయడంపై దృష్టి సారించారు.

పీడీఎస్ బియ్యం రవాణా, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, డీలర్ల కార్యకలాపాలపై తనిఖీలు నిర్వహిస్తున్నారు.వాహనాల పర్యవేక్షణ, డిజిటల్ ట్రాకింగ్, డేటా ఆధారిత నిఘా, ఆకస్మిక తనిఖీలు వంటి విధానాలు అక్రమ రవాణాను గుర్తించడంలో కీలకంగా మారుతున్నాయి.రైస్ మిల్లులు, డీలర్లు, అక్రమ రవాణా వ్యవస్థపై నిఘా పెరగడంతో పేదల బియ్యాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసే అవకాశం పెరుగుతోంది.

**మూడు శాఖలు.. మూడు టార్గెట్లు..**
**ఫార్ములా ఒక్కటే..**

హైడ్రా టార్గెట్ ఆక్రమణలు. పోలీసుల టార్గెట్ కల్తీ దందాలు. సివిల్ సప్లైస్ టార్గెట్ రేషన్ అక్రమాలు. మూడు రంగాలు వేరు అయినా పని తీరు విషయంలో ఒక సామాన్య అంశం కనిపిస్తోంది.

**టెక్నాలజీతో నిఘా..**
**క్షేత్రస్థాయిలో యాక్షన్..**

ఒకప్పుడు అధికారులకు సమాచారం అందిన తర్వాత దాని ఆధారంగా తనిఖీలు జరిగేవి. ఇప్పుడు డ్రోన్లు, శాటిలైట్ చిత్రాలు, జీపీఎస్, డిజిటల్ డేటా, కమాండ్ సెంటర్లు, సోషల్ మీడియా ఫిర్యాదులు వంటి ఆధునిక సాధనాలు నిఘా వ్యవస్థలో భాగమవుతున్నాయి.దీంతో పాలనలో పారదర్శకతకు అవకాశం పెరగడంతో పాటు అధికారుల పనితీరును కూడా ప్రజలు నేరుగా గమనించే పరిస్థితి ఏర్పడుతోంది.

**రేవంత్ ఫ్రీహ్యాండ్**
**అధికారుల దూకుడుకు అసలు బలం అదేనా..**

అధికారులకు స్వేచ్ఛ ఇవ్వడం రాజకీయంగా సులభమైన నిర్ణయం కాదు. ఎందుకంటే కఠిన చర్యలు తీసుకున్నప్పుడు సహజంగానే రాజకీయ, సామాజిక, ఆర్థిక ఒత్తిళ్లు ఎదురయ్యే అవకాశం ఉంటుంది.అలాంటి సమయంలో అధికారులకు ప్రభుత్వ స్థాయిలో స్పష్టమైన మద్దతు ఉంటేనే వారు నిబంధనల మేరకు నిర్ణయాలు తీసుకునే ధైర్యం చేయగలరు.తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారులకు ఇస్తున్న ఫ్రీహ్యాండ్ ఇప్పుడు ఈ చర్చకు కేంద్రబిందువుగా మారింది. అక్రమం ఎవరు చేసినా చట్టం తన పని తాను చేసుకునేలా వ్యవస్థకు స్వేచ్ఛ ఇవ్వడం ప్రభుత్వానికి పరిపాలనా పరంగా మాత్రమే కాకుండా రాజకీయంగా కూడా మైలేజ్ తీసుకొచ్చే అంశంగా మారవచ్చు.అయితే ఫ్రీహ్యాండ్ అంటే అధికారాలకు హద్దులు లేవని కాదు. చట్టపరమైన పరిధిలో, నిర్దేశిత నిబంధనల ప్రకారం, ఆధారాలతో కూడిన చర్యలే ప్రజాస్వామ్య పాలనకు బలం.

**సామాజిక బాధ్యతే**
**అసలు పరీక్ష..**

కబ్జాదారులపై చర్యలు తీసుకోవడం వల్ల ఒక చెరువు కాపాడబడుతుంది. కానీ చెరువు కాపాడబడితే దాని చుట్టూ ఉన్న వేల కుటుంబాల భవిష్యత్తు భద్రపడుతుంది.కల్తీ దందాను అరికడితే ఒక వ్యాపారి నష్టపోవచ్చు. కానీ అదే సమయంలో వేలాది మంది ప్రజల ఆరోగ్యం రక్షించబడుతుంది.రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటే ఒక మాఫియా వ్యవస్థకు నష్టం రావచ్చు. కానీ ఆ బియ్యం నిజమైన లబ్ధిదారుడి ఇంటికి చేరితే ఒక కుటుంబానికి ఆహార భద్రత లభిస్తుంది.అందుకే ఈ చర్యలను కేవలం అధికారుల దూకుడుగా కాకుండా సామాజిక బాధ్యతతో కూడిన పాలనా చర్యలుగా చూడాల్సిన అవసరం ఉంది.

**సంకల్పం ఉంటే..**
**వ్యవస్థ కదులుతుంది..**

రాజకీయ సంకల్పం లేకుండా అధికారులు ఎంత సమర్థులైనా కొన్ని నిర్ణయాలు కాగితాలకే పరిమితం కావచ్చు. అదే సమయంలో అధికారుల సామర్థ్యం లేకుండా రాజకీయ సంకల్పం ఉన్నా ఫలితాలు ఆశించిన స్థాయిలో కనిపించకపోవచ్చు.ఈ రెండింటికీ తోడు సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల భాగస్వామ్యం కలిస్తేనే పాలనకు అసలైన భాగస్వామ్యం లభిస్తుంది.హైడ్రా.. హైదరాబాద్ పోలీసులు.. సివిల్ సప్లైస్ ఈ మూడు విభాగాల్లో కనిపిస్తున్న కార్యాచరణ ఇదే ప్రశ్నను ముందుకు తెస్తోంది.అధికారులకు స్వేచ్ఛ.. చట్టానికి గౌరవం.. టెక్నాలజీకి ప్రాధాన్యం.. ప్రజలకు జవాబుదారీతనం..ఇవే సమర్థ పాలనకు నాలుగు స్తంభాలైతే, వాటిని ఎంత సమర్థంగా అమలు చేస్తారన్నదే అసలు పరీక్ష.అక్రమార్కులకు మూడు సింహాల ముప్పు ఎంతకాలం కొనసాగుతుందన్నది ఒక అంశం అయితే.. ఈ దూకుడు చర్యలు శాశ్వత వ్యవస్థాగత మార్పుగా మారుతాయా అన్నదే అసలు ప్రశ్న.ఎందుకంటే.. ఒక్కో అక్రమాన్ని అడ్డుకోవడం ఒక విజయం కావచ్చు. కానీ అక్రమాలకు అవకాశం లేకుండా వ్యవస్థను మార్చడమే అసలైన పాలనా విజయం..

## హిందువులారా.. జెన్‌జీ బాటలో గళం విప్పండి

**ప్రజా వాయిస్,హైదరాబాద్:** సనాతన ధర్మం, హిందూత్వ పరిరక్షణ కోసం నేటి తరం యువత గళం విప్పాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన.. జెన్‌జీ యువతలో వస్తున్న చైతన్యాన్ని ప్రశంసించారు. “హిందువులు నేటి తరం జెన్‌జీలను స్ఫూర్తిగా తీసుకోవాలి. యువత కేవలం ఆకాశంలోకి రాకెట్లు పంపడానికే పరిమితం కావడం లేదు.. సనాతన ధర్మం, హిందూత్వ పరిరక్షణ కోసం ధైర్యంగా గళం విప్పుతోంది'' అని అన్నారు.

**బోనాలకు రూ.20 కోట్లు..**
**రంజాన్‌కు రూ.33 కోట్లా..?**

రాష్ట్ర ప్రభుత్వం పండుగల నిర్వహణకు నిధులు కేటాయిస్తున్న తీరుపై బండి సంజయ్ ప్రశ్నలు సంధించారు. బోనాల నిర్వహణకు రూ.20 కోట్లు కేటాయించి.. రంజాన్‌కు రూ.33 కోట్లు కేటాయించడం ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. హిందువుల పండుగలు, ఆలయాలు, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.గోమాత పరిరక్షణ, ఆలయాల రక్షణ, సనాతన ధర్మం కోసం తాను నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. హిందూ సమాజం తన హక్కులు, సంప్రదాయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**150 పోస్టులు..**
**వేలాది నిరుద్యోగులు**

తెలంగాణలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని బండి సంజయ్ విమర్శించారు. హైడ్రాలో కేవలం 150 పోస్టుల భర్తీ కోసం వేలాది మంది నిరుద్యోగులు పోటెత్తడం రాష్ట్రంలో ఉద్యోగాల పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. ఎన్నికల సమయంలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ఆ హామీలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం రోజ్‌గార్ మేళాల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. తెలంగాణ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరింత చొరవ చూపాలని సూచించారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై**
**ఆందోళన**

ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, వృద్ధాప్య పెన్షన్ల పెంపు వంటి ఎన్నికల హామీల అమలుపైనా ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

**బోనాల వేదికగా బండి సంజయ్**
**సూటి ప్రశ్నలు**

బోనాల పండుగ వేదికగా బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వంపై రాజకీయంగా దుమారం రేపేలా ఉన్నాయి. ఒకవైపు హిందూ పండుగలకు నిధుల కేటాయింపుపై ప్రశ్నలు.. మరోవైపు నిరుద్యోగం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఎన్నికల హామీల అమలుపై విమర్శలు గుప్పిస్తూ ప్రభుత్వాన్ని ఆయన టార్గెట్ చేశారు. యువతలో చైతన్యం పెరుగుతోందని, తమ హక్కుల కోసం ప్రశ్నించే తరం ముందుకొస్తోందని పేర్కొంటూ జెన్‌జీని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించడం చర్చనీయాంశంగా మారింది.

## యాదాద్రిలో రూ.54 కోట్ల 'డ్రగ్ ల్యాబ్' గుట్టురట్టు

**ప్రజా వాయిస్,యాదాద్రి భువనగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంగా సాగుతున్న అంతర్రాష్ట్ర డ్రగ్ దందా గుట్టురట్టయింది. కోట్లాది రూపాయల విలువైన మెఫెడ్రోన్‌ను తయారు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించే ముఠా కార్యకలాపాలను బీబీనగర్ పోలీసులు, ఎస్ఓటీ బృందాలు ఛేదించాయి. కొండమడుగు శివారులో కారును తనిఖీ చేస్తుండగా 27 కిలోల మెఫెడ్రోన్ పట్టుబడటం సంచలనం రేపింది. దీని విలువ సుమారు రూ.54 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేయగా.. మరో నలుగురు కీలక నిందితులు పరారీలో ఉన్నారు.

**మూడు రోజులు..**
**ల్యాబ్‌లో 'డ్రగ్' తయారీ**

ఈ నెల 8న కొండమడుగు గ్రామ శివారులో అనుమానాస్పదంగా వెళ్తున్న కారును పోలీసులు తనిఖీ చేయడంతో అసలు వ్యవహారం బయటపడింది. కారులో భారీగా మెఫెడ్రోన్ లభించడంతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి విచారణలో కొండమడుగులోని వెట్కూరి ల్యాబ్స్‌లో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు మెఫెడ్రోన్‌ను తయారు చేసినట్లు వెల్లడించినట్టు పోలీసులు తెలిపారు. తయారు చేసిన డ్రగ్‌ను నాగ్‌పూర్‌కు తరలించి అక్కడి నుంచి పంపిణీ చేసేందుకు ముఠా పన్నాగం పన్నినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో పోలీసులు ల్యాబ్‌పై దాడి చేసి డ్రగ్ తయారీకి ఉపయోగించిన రియాక్టర్, సెంట్రిఫ్యూజ్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

**'ల్యాబ్' వెనుక అంతర్రాష్ట్ర ముఠా**

ఈ వ్యవహారంలో మహారాష్ట్రకు చెందిన చేతన్ మధుకర్ మెష్రమ్, ఆకాశ్ అశోక్ గవాండే, అసోంకు చెందిన ముజామల్ హక్, హైదరాబాద్ చందానగర్‌కు చెందిన ఉపద్రష్ట రమణమూర్తిలను పోలీసులు అరెస్టు చేశారు.చేతన్ ముఠాకు ఆర్గనైజర్‌గా వ్యవహరించడంతో పాటు ఆర్థిక సహకారం అందించినట్లు పోలీసులు గుర్తించారు. ముజామల్ డ్రగ్ తయారీలో సహకరించినట్లు.. ఆకాశ్ రవాణా బాధ్యతలు చూసినట్లు.. రమణమూర్తి ఇతర వ్యవహారాల్లో సహకరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**నలుగురు 'కీలక' వ్యక్తులు పరారీ**

డ్రగ్ దందాతో సంబంధం ఉన్న ఎం.డి. అయూబ్ అలీ, చందా ప్రదీప్ ఠాకూర్, గోపాల్ సిర్వట్ పటేలియా, యేటుకూరి రామరాజు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. వీరి అరెస్టుతో ఈ అంతర్రాష్ట్ర డ్రగ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

## డేటింగ్ పేరుతో డేంజర్ గేమ్

**మొదటి పేజీ తరువాయి**

చేసేదని దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది.

**వీడియోలే ఆయుధాలు**

భేటీ తర్వాత రహస్యంగా తీసిన వీడియోలు, ఫొటోలను చూపిస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడేదని ఆరోపణలు ఉన్నాయి. సోషల్ మీడియాలో పెడతానని, కుటుంబ సభ్యులకు పంపుతానని బెదిరించి భారీ మొత్తాలు డిమాండ్ చేసేదని సమాచారం. పరువు పోతుందనే భయంతో బాధితులు డబ్బులు చెల్లించేవారని పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.

**ఎదురు తిరిగితే..**
**కేసుల బెదిరింపులు**

తన డిమాండ్లకు లొంగని వారిపై లైంగిక వేధింపులు, అత్యాచారయత్నం వంటి ఆరోపణలతో కేసులు పెట్టిస్తానంటూ బెదిరించేదని పోలీసుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. దీంతో పలువురు బాధితులు భయంతో ఈ వ్యవహారాన్ని బయటకు చెప్పలేకపోయారని తెలుస్తోంది.

**లాయర్ ఫిర్యాదుతో గుట్టురట్టు**

ఇటీవల ఓ హైకోర్టు న్యాయవాదిని కూడా ఇదే తరహాలో బెదిరించినట్లు సమాచారం. అయితే ఆయన బెదిరింపులకు లొంగకుండా ఆధారాలతో పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పల్లవి సింగ్ వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చినట్లు తెలిపారు.

**పరారీలో నిందితురాలు**

ప్రస్తుతం పల్లవి సింగ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఆమె కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈ హనీట్రాప్ వెనుక మరెవరైనా ఉన్నారా బాధితులు ఎంతమంది రూ.6 కోట్లకు మించి మరింత సొమ్ము వసూలు చేశారా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.



## ఆకాశం కరుణించాలి.. సాగర్ నిండాలి..

ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. యాగం నేపథ్యంలో విజయ్ విహార్ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో పాటు భారీ భద్రతా ఏర్పాట్లతో సిద్ధమైంది.

**తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభం**

వరుణ యాగం సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 3.20 గంటలకు ముగియనుందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. యాగశాలలో 11 హోమగుండాలను ఏర్పాటు చేయడంతో పాటు 108 మంది రుత్వికులకు ప్రత్యేక ఆసనాలు, యాగ సామగ్రిని సిద్ధం చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జపాలు, హోమాలు, వేద పారాయణాలు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి హాజరయ్యే ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

**కలెక్టర్, ఎస్పీ క్షేత్రస్థాయి పరిశీలన**

ఆదివారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తో కలిసి వరుణ యాగం ఏర్పాట్లను మరోసారి పరిశీలించారు. ముందుగా బీసీ సంక్షేమ హాస్టల్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించిన అనంతరం విజయ్ విహార్ వెనుకవైపు కృష్ణా నది ఒడ్డున ఏర్పాటు చేసిన యాగశాల, హోమగుండాలు, రుత్వికుల ఆసనాలు, యాగ సామగ్రి, పగోడాలు, బ్యారికేడ్లు, పోలీసు బందోబస్తు, ఎల్ఈడీ స్క్రీన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

**ప్రజల కోసం ప్రత్యేక గ్యాలరీలు.. ఎల్ఈడీ స్క్రీన్లు**

వరుణ యాగాన్ని ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించేలా విజయ్ విహార్ ప్రాంగణంలో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ప్రవచనాలు వినేందుకు ప్రత్యేక ప్రవచనశాలతో పాటు సాధారణ ప్రజల కోసం ప్రత్యేక గ్యాలరీ, మీడియా ప్రతినిధుల కోసం మీడియా గ్యాలరీలను సిద్ధం చేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు యాగ క్రతువును వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రాంగణం మొత్తం ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా యాగ కార్యక్రమాన్ని వీక్షించే అవకాశం కల్పించారు.

**పాస్ ఉన్నవారికే ప్రవేశం**

ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సోమవారం విజయ్ విహార్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ ప్రవేశ పాస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, పాస్ ఉన్నవారిని మాత్రమే యాగ ప్రాంగణంలోకి అనుమతించాలని పోలీసు అధికారులకు సూచించారు. హెలీప్యాడ్, యాగశాల, వీఐపీ రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి పరిశీలన**

వరుణ యాగం ఏర్పాట్లను నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి పరిశీలించారు. అధికారులతో ఏర్పాట్లపై ఆరా తీసిన ఆయన, యాగశాల, భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు కూడా ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్‌రెడ్డి, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సాగర్ నిండితే.. రైతు బతుకులో పచ్చదనం**

సాగర్ ఆయకట్టు రైతులకు నాగార్జునసాగర్ జలాశయం నీరు అత్యంత కీలకం. సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని, కృష్ణా నది పరవళ్లు తొక్కాలని, సాగర్ ఆయకట్టులో పంటలు పచ్చగా కళకళలాడాలని రైతాంగం ఆకాంక్షిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, జలసమృద్ధి కోసం నిర్వహిస్తున్న వరుణ యాగంపై సాగర్ పరివాహక ప్రాంత ప్రజల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది.

## మృత్యువుతో పోరాడి ఓడిన వైద్య విద్యార్థిని

**ప్రజా వాయిస్, హైదరాబాద్;** ఆమె పేరు ప్రియాంక.. భవిష్యత్తులో ఎందరో ప్రాణాలను కాపాడాల్సిన వైద్యురాలు కావాలనుకుంది. వైద్య విద్యను అభ్యసిస్తూ తన లక్ష్యం వైపు అడుగులు వేస్తున్న ఆమెను.. ఓ కారు రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. ర్యాష్ డ్రైవింగ్‌కు బలై.. ఆరు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ప్రియాంక చివరకు కన్నుమూశారు. కుటుంబ సభ్యుల ఆశలను, భవిష్యత్తు కలలను విషాదంలో ముంచుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు.ఈ నెల 3న రాజమండ్రిలోని ప్రసాదిత్యా మాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రియాంక తీవ్రంగా గాయపడ్డారు. స్కూటీపై వెళ్తున్న ఆమెను మద్యం మత్తులో ఉన్న సూరావరపు దుష్యంత్, ఆండ్రూ జోసెఫ్ కారు నడుపుతూ ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఒక్కసారి కాదు.. ఏకంగా మూడుసార్లు కారుతో ఢీకొట్టడంతో ప్రియాంక తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదం అనంతరం ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

**ఆరు రోజులుగా మృత్యువుతో పోరాటం**

కిమ్స్‌లో వైద్యులు ప్రియాంకను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆమె కోలుకుంటుందనే ఆశతో ఎదురుచూశారు. అయితే పరిస్థితి రోజురోజుకూ విషమించింది. చివరకు బ్రెయిన్‌డెడ్ కావడంతో ఆదివారం వైద్యులు ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మధ్యాహ్నం 3.22 గంటలకు ఆమె తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**కుటుంబంలో తీరని విషాదం**

వైద్యురాలిగా చూడాలనుకున్న కుమార్తె ఇక లేదన్న వార్తతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. చదువులో ముందుండి.. భవిష్యత్తుపై ఎన్నో కలలతో సాగుతున్న ప్రియాంక జీవితం ర్యాష్ డ్రైవింగ్‌తో అర్ధాంతరంగా ముగిసిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కుటుంబం ఆశలను మాత్రమే కాదు.. ఓ యువ వైద్యురాలి భవిష్యత్తునే నిర్లక్ష్యపు డ్రైవింగ్ బలిగొందని వారు కన్నీటి పర్యంతమయ్యారు.

## జీ.వో 16 కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణలో కుంభకోణం?

**మొదటి పేజీ తరువాయి**

శాంపిల్ గా ఈ 35 మంది ఫేక్ అధ్యాపకుల లిస్టును వదిలితే.. మిగతా వారందరు చెప్పినట్లు వింటారని ఉద్యోగ సంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మిగతా వారు మాట వినకపోతే..అధికారులతో మాట్లాడి దశలవారీగా తొలగించే ప్రయత్నాలు చేస్తున్నట్లుగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.జీవో 16 ద్వారా రెగ్యులర్ అయినవారిలో ఆ ఉద్యోగ సంఘం నాయకుడికి కనుసనల్లో ఉన్న కొంతమంది కాంటాక్ట్ లెక్చర్లకు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఇంక్రిమెంట్లు ఇస్తున్నారు .. మిగతా వారికి ఒకసారి ఇంక్రిమెంట్ ఇచ్చి, మిగతా ఇంక్రిమెంట్లు ఆపడంలో ఆంతర్యం ఏమిటో అధికారులకే తెలియాలి..

**ఒకేషనల్ కాంట్రాక్ట్ లెక్చరర్లకు పోస్టు సాంక్షన్ లేదన్న సాకుతో తీరని అన్యాయం...**

ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు బోధనలో 400 పైగా అర్హులైనటువంటి కాంట్రాక్ట్ అధ్యాపకులకు రెగ్యులర్ చేయకుండా..వాళ్ళని పక్కకు పెట్టి, అధికారులకు అనుకూలమైన వారిని, అనర్హులు అయినటువంటి కొంతమంది ఒకేషనల్ అధ్యాపకులను రెగ్యులర్ చేయడం వెనక మర్మమేమిటో? దీనిపైన అర్హులైనటువంటి ఒకేషనల్ కాంట్రాక్ట్ అధ్యాపకులు ఇంటర్మీడియట్ బోర్డు వారిని అడగగా మీవి సాంక్షన్ పోస్టులు కావని.. అర్హత కలిగిన సబ్జెక్టులు కావని దానికి సంబంధించిన జీవో కాపీలు మా దగ్గర లేవని అధికారులు తప్పించుకు తిరగడంతో.. 400 మందికి పైగా ఉన్న ఒకేషనల్ అధ్యాపకుల కుటుంబాలు అయోమయంలో పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజా వాయిస్ అధికారులకు సంధిస్తున్న ప్రశ్నలు..**

జీవో 16, బోర్డు నిబంధనలను, క్షేత్రస్థాయిలో సర్టిఫికెట్లను, నిబంధనల ప్రకారం ఇతర రాష్ట్రాల్లో పీజీలు చేసిన వ్యక్తులకు ఇక్కడ ఎలిజిబిలిటీ లేదు.. అర్హతలను, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్లను పాటించి గుర్తించాల్సిన త్రిసభ్య కమిటీ, ప్రిన్సిపాల్స్ ఏం చేశారు?
వీటన్నిటిని పూర్తిస్థాయిలో వెరిఫికేషన్ చేయాల్సినటువంటి డి.ఐ.ఈ.ఓ లు, పది మంది దాకా ఉండే సూపరిండెంట్లు ఎన్ని సంవత్సరాలు ఏం చేశారు?
నాలుగు సార్లు.. మొదటిసారిగా కళాశాల ప్రిన్సిపల్ చేత, రెండవసారి డి.ఐ.ఈ.ఓ, మూడవసారి డి.ఐ.ఈ.ఓ తో కూడిన కన్వీనర్ గా త్రీమెన్ కమిటీ, నాలుగోసారి ఆర్జెడి ప్రధానంగా సెక్షన్లలో ఉన్న సూపరిండెంట్ల ఆధ్వర్యంలోవెరిఫికేషన్ జరిగినప్పటికీ వాళ్ళని పట్టుకోవడంలో అధికారులు, విజిలెన్స్ ఎంక్వయిరీ కమిటీ ఎందుకు విఫలమయ్యారు?
కొంతమంది ఇర్రెగ్యులర్ సర్వీస్ ఉన్న వారిని కూడా రెగ్యులర్ చేశారు.. రిమార్క్ కాలంలో ఇర్రెగ్యులర్ సర్వీస్ అని రాయాల్సి ఉండగా సంబంధిత ప్రిన్సిపాల్ అలా రాయకుండా ఉండడానికి ముడుపులతో సర్దుకుపోయారా?

**ఇవన్నీ తేలాలంటే**

నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చిన వాళ్ళు ఎవరు? తెచ్చిన వాళ్ళు ఎవరు? ఆ నకిలీ సర్టిఫికెట్ల ద్వారా జాయిన్ అనుమతి ఇచ్చిన అధికారులు ఎవరు? వెరిఫికేషన్ చేసిన విజిలెన్స్ ఆఫీసర్లు ఎవరు? ఫైనల్ గా జాబ్ లోకి రెగ్యులర్ చేసింది ఎవరు? ఇన్ని రోజులు వెరిఫికేషన్ చేసిన ఈ నకిలీ ఉద్యోగస్తులు ఇన్ని రోజులు సర్వీస్ లో ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా.. వత్తాసు పలుకుతూ వచ్చిన సంబంధిత పై అధికారుల పై సి.బి.సి.ఐ.డి విచారణ నిర్వహించి అవినీతికి కారణమైన ఉద్యోగులందరి పైన చట్టప్రకారం చర్యలు తీసుకొని శిక్షించాలని..ఈ వ్యవహారమంత బయటికి రావాలంటే జీవో 16 ద్వారా రెగ్యులర్ అయినటువంటి 5544 పైగా ఉద్యోగుల రీ వెరిఫికేషన్ ప్రక్రియను ఈ ప్రజా ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా జరిపి అర్హులకు న్యాయం చేసి, అనర్హులను తొలగించి, క్షేత్రస్థాయిలో సంబంధిత అవినీతి అధికారులను గుర్తించి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు విద్యార్థి, నిరుద్యోగ సంఘాలు కోరుతున్నాయి.



# ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనమే సుగుణమ్మ హత్యకు కారణం!

- చికెన్ షాప్ నిర్వాహకుడు ప్రశాంతే ప్రధాన సూత్రధారి
- దొంగిలించిన బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టిన బావమరిది
- 20 రోజుల్లో కేసు తేల్చిన స్పెషల్ టీమ్స్‌కు, తిరుమలాయపాలెం పోలీసులకు సీపీ అభినందనలు
- వివరాలు వెల్లడించిన ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి

**ప్రజా వాయిస్ ఖమ్మం:** ఆన్‌లైన్ బెట్టింగ్ అనే వ్యసనం మరొకరి ప్రాణాన్ని తీసింది! కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే పేరాశ.. చివరికి ఒక వృద్ధురాలి దారుణ హత్యకు దారితీసింది. ఖమ్మం జిల్లా, తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో గత నెలలో సంచలనం సృష్టించిన వృద్ధురాలు చెన్నా సుగుణమ్మ హత్య కేసును రూరల్ పోలీసులు ఛేదించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న చికెన్ షాప్ నిర్వాహకుడు ప్రశాంత్, తన షాప్ సమీపంలో ఉండే సుగుణమ్మ నగలను దోచుకోవాలని పథకం వేశాడు. గత నెల 17 అర్ధరాత్రి ఆమె ఇంట్లోకి చొరబడి.. అడ్డువచ్చిన సుగుణమ్మను ఇనుప రాడ్డుతో మోది దారుణంగా హత్య చేశాడు. అనంతరం దోచుకెళ్లిన బంగారాన్ని తన బావమరిది మహేష్ సహాయంతో బ్యాంకులో తాకట్టు పెట్టించాడు.ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితున్ని, బంగారం తాకట్టు పెట్టి సహకరించిన ఇద్దరిని ప్రత్యేక బృందాలతో రంగంలోకి దిగి తిరుమలాయపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి గారు ఈ హత్య కేసు వివరాలను వెల్లడించారు...ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు ప్రశాంత్ (A1), అతనికి సహకరించిన అతని బావమరిది మహేష్ (A2)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి చోరీకి గురైన బంగారం, నేరానికి ఉపయోగించిన బైక్, రక్తపు మరకలున్న ఇనుప రాడ్ మరియు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. 20 రోజుల్లో కేసును ఛేదించిన దర్యాప్తు బృందాలను జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.ఖమ్మం రూరల్ ఏసీపీ పర్యవేక్షణలో కూసుమంచి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి. సంజీవ్ ఆధ్వర్యంలో 4 ప్రత్యేక దర్యాప్తు బృందాలను (SI టీమ్‌లు) ఏర్పాటు చేసి నిందితులను త్వరితగతిన అరెస్ట్ చేశారు. కేసును వేగంగా ఛేదించిన ఎస్సైలు పి. సంతోష్, జె. నాగరాజు, దివ్య, పి.జగదీష్, పి.శ్రీనివాస్ రెడ్డి హరికృష్ణ ఇతర సిబ్బందికి రివార్డు అందించారు.

# అద్దె డాక్టర్లతో మాయాజాలం!

- ప్రచారంలో 24 గంటల వైద్యం
- క్షేత్రస్థాయిలో డాక్టర్ల కొరత!
- 24 గంటల సేవల ముసుగులో అద్దె వైద్యుల వ్యవహారం!
- అత్యవసర వేళల్లో వైద్యం అందక రోగుల ప్రాణాలకు ముప్పు
- ఇప్పటికే గాలిలో కలిసిన ప్రాణాలెన్నో
- వికారాబాద్‌లో ప్రైవేట్ ఆసుపత్రుల తీరుపై ప్రశ్నలు

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ప్రకటనలు... అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా చికిత్స అందిస్తామని హామీలు... కానీ వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో శాశ్వత వైద్యుల స్థానంలో అద్దె ప్రాతిపదికన డాక్టర్లను అందుబాటులో ఉంచుతూ 24 గంటల వైద్య సేవల పేరుతో నిర్వహణ సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అత్యవసర సమయంలో డాక్టర్ ఎక్కడ?రోగి పరిస్థితి విషమంగా ఉన్నప్పుడు ఒక్క నిమిషం ఆలస్యం కూడా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ప్రమాదాలు, గుండెపోటు, స్ట్రోక్, శ్వాస సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే నిపుణులైన వైద్యుడి పర్యవేక్షణ అవసరం. అయితే కొన్ని ఆసుపత్రుల్లో ఆ సమయంలో సంబంధిత నిపుణుడు అందుబాటులో లేకపోవడంతో రోగులను మరో ఆసుపత్రికి తరలించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## బోర్డుపై 24 గంటలు... లోపల మాత్రం?

ఆసుపత్రుల బయట "24×7 వైద్య సేవలు" అంటూ ప్రచారం కనిపిస్తున్నప్పటికీ, వాస్తవంగా అన్ని సమయాల్లో అర్హత కలిగిన వైద్యులు అందుబాటులో ఉన్నారా? అత్యవసర వైద్యం కోసం అవసరమైన నిపుణులు విధుల్లో ఉన్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కొన్ని ఆసుపత్రుల్లో మాత్రమే రెగ్యులర్‌గా వైద్యులు అందుబాటులో ఉంటుండగా, మరికొన్ని చోట్ల అవసరమైన సమయంలో ఇతర ప్రాంతాల నుంచి డాక్టర్లను పిలిపించుకునే విధానం కొనసాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

## అధికారుల తనిఖీలు ఎక్కడ?

ప్రైవేట్ ఆసుపత్రులపై సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా? ఆసుపత్రులు ప్రకటిస్తున్న సేవలకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారా? అత్యవసర చికిత్స పేరుతో రోగుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులకు అనుగుణంగా సేవలు అందుతున్నాయా? అనే అంశాలపై సమగ్ర పరిశీల న అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.వికారాబాద్ జిల్లాలో 24 గంటల వైద్య సేవల పేరుతో నడుస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై సమ గ్ర తనిఖీలునిర్వహించి,వాస్తవ పరిస్థితిని ప్రజలకు వెల్లడించాల్సిన సమయం ఆసన్నమైంది.

# కథనాలు వచ్చినా కదలని యంత్రాంగం

- పెద్ద శంకరంపేట ప్రయాణ ప్రాంగణంలో మూతపడ్డ మరుగుదొడ్లు!
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు.. పట్టించుకోని డిపో యాజమాన్యం
- ఆరుబయట మూత్ర విసర్జనకు వెళ్తున్న ప్రయాణికులు
- ప్రయాణ ప్రాంగణంలో ప్రాథమిక సౌకర్యాలు కరువు





**ప్రజా వాయిస్, పెద్ద శంకరం పేట.**పెద్ద శంకరంపేట ప్రయాణ ప్రాంగణంలోని మూతపడిన మరుగుదొడ్ల సమస్యపై గతంలో పలు కథనాలు వచ్చినా సంబంధిత యంత్రాంగంలో మాత్రం కదలిక కనిపించడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు, డిపో యాజమాన్యం సమస్యను పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.ప్రయాణ ప్రాంగణంలో మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు మరింత అవస్థలు పడుతున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కొందరు ఆరుబయట మూత్ర విసర్జనకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రయాణ ప్రాంగణంలో ప్రయాణికులకు కనీస ప్రాథమిక సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, మూతపడిన మరుగుదొడ్లను ఇప్పటివరకు ఎందుకు తెరిపించలేదని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు, డిపో యాజమాన్యం స్పందించి మరుగుదొడ్లను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, ప్రయాణికులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.




# తలకొండపల్లిలో జోరుగా ముందు కళ్ళు అమ్మకాలు

- మందు కళ్ళు బానిసలు అవుతున్న గ్రామ ప్రజలు
- దొంగతనాలకు పాల్పడుతూ రోడ్డున పడుతున్న కుటుంబాలు
- చర్యలు చేపట్టాలని కోరుతున్న గ్రామస్తులు

**ప్రజావాయిస్/తలకొండపల్లి :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం కేంద్రంలో జోరుగా మందు కళ్ళు అమ్మకాలు జరుగుతున్నాయి. గ్రామ ప్రజలు మందు కళ్ళు కు బానిసలు అవుతున్నారు. తక్కువ ఖర్చుకే మందు కళ్ళు రావడంతో మత్తుకు ఏం చేస్తున్నామో తెలియక వింత వింతగా ప్రవర్తిస్తున్నారు. కొంతమంది మందు కళ్ళకు బానిసలై బియ్యం అమ్ముకొని, ఇంట్లో ఉన్న సామాను అమ్ముకొని మందు కళ్ళకు తాగుతూ బానిసలు అయ్యారు. కొందరి కుటుంబాలలో మందు కళ్ళు ఓ శాపంగా మారింది. పిల్లలను పట్టించుకోవాల్సిన తల్లిదండ్రులే మందు కళ్ళు కి అలవాటై పిల్లలకు సరిగా అన్నం పెట్టడం స్థితిలో కూడా ఉండడం లేదు. మందు కళ్ళు తాగి కొంతమంది ఆడవాళ్లు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఎవరు లేని సమయంలో ఇండ్ల ముందు ఉన్న వివిధ వస్తువులను అమ్ముకొని మందు కళ్ళకి బానిసలు అవుతున్నారు. కొంతమంది ఆడవాళ్లకు ఏం చేస్తున్నామో తెలియలేని స్థితిలో ఉంటూ రెండు మూడు రోజుల వరకు అదే మత్తులో జీవిస్తున్నారు. 10, 20 రూపాయలకే సీసా రావడంతో ఒకటి లేదా రెండు సీసాలు తాగుతూ ఇక్కడే రోడ్ల పైన పడి పడిపోతున్నారు. రెండు మూడు నెలల నుంచి జోరుగా మందు కళ్ళు అమ్మకాలు జరుగుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని నియమ నిబంధనలు పెట్టిన ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదు. అధికారులు కూడా ఏ ఒక్కరు దృష్టి పెట్టకపోవడంతో యదేచ్చగా ముందు కళ్ళను అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాలలో మందు కళ్ళు అమ్ముతున్న వారిపై చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# ఇసుక దందాకు అడ్డూ అదుపు లేదా..!

- సెలవొస్తే చాలు.. మందర్నా మంజీర నుంచి అక్రమ రవాణా
- అనుమతుల్లేకుండానే తరలింపు
- పట్టించుకోని అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం

**ప్రజా వాయిస్,సాలూరు:** బోధన్ నియోజకవర్గం సాలూరు మండలం మందర్నా మంజీర పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వరుస సెలవుదినాలను ఆసరాగా చేసుకుని ఇసుక తరలింపుదారులు మరింతగా రెచ్చిపోతున్నారని వారు పేర్కొంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే మంజీర నుంచి ఇసుకను తవ్వి వాహనాల్లో తరలిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అక్రమ ఇసుక రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతో పాటు మంజీర పరివాహక ప్రాంత పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక తరలింపు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

## సెలవుదినాల్లో మరింత జోరు..

సెలవులు వరుసగా వస్తే అక్రమ ఇసుక రవాణా మరింత పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇసుక తరలింపునకు వినియోగిస్తున్న వాహనాలపై నిఘా పెట్టి, అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు పరిశీలించాలని కోరుతున్నారు.మందర్నా మంజీర ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగిస్తున్న వారిని గుర్తించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.






# కాంప్లెక్స్ కూల్చివేత వెనుక రాజకీయ కుట్ర

- అప్పుడు అనుమతుల హామీ.. ఇప్పుడు నోటీసులు
- బాధితులకు తక్షణమే న్యాయం చేయాలి
- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వైఖరిపై సీపీఐ నాయకుడు మార్కపురి సూర్య ధ్వజం

**ప్రజా వాయిస్ రామగుండం** పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్బీనగర్ కాంప్లెక్స్ కూల్చివేత వెనుక రాజకీయ కుట్ర ఉందని సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య ఆరోపించారు. ఎల్బీనగర్‌లో బాధితులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతులు ఇప్పిస్తానని చెప్పిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ఇప్పుడు సింగరేణి అధికారులు నోటీసులు ఇస్తున్నా మౌనంగా ఉండటం సరికాదు అని సూర్య విమర్శించారు. బాధితులకు షాపులు కేటాయించకపోతే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. తిలక్ నగర్, ఓల్డ్ అశోక్, రాజేష్ థియేటర్ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికార పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ప్రతీ కాంప్లెక్స్ వివరాలను బహిరంగంగా ప్రకటించాలని, బాధితులకు అన్యాయం జరిగితే సీపీఐ తరపున పోరాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గౌతమ్ గోవర్ధన్, కే. కనకరాజ్, శనిగరపు చంద్రశేఖర్, రేణిగుంట్ల ప్రీతం, రాణవేణి సుధీర్ మరియు బాధితులు పూసాల శంకర్, సోడాల కనకమ్మ, ఎజ్జు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గుట్టలను తలపిస్తున్న మట్టి కుప్పలు

- పగలు కృత్రిమ ఇసుక తయారీ
- రాత్రి వేళలో అక్రమ రవాణా
- మామూళ్ల మత్తులో రెవెన్యూ, పోలీస్ అధికారులు
- ఇలా ఇసుక ఫిల్టర్ ను కూల్చివేయడం వెనువెంటనే ఏర్పాటు చేసుకోవడం
- ప్రకృతి సంపదను దోచుకుంటున్న పట్టించుకోని అధికారులు
- సంగారెడ్డి, కంది మండలంలో జోరుగా కృత్రిమ ఇసుక దందా



**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** ఇక్కడ దూర ప్రాంతం నుంచి చూస్తే ఎత్తైన కొండలు అనేలా కనిపిస్తాయి.... కానీ దగ్గరికి వెళ్లి చూస్తే కానీ అవి మట్టి కుప్పలు అని తెలియదు. ఇది సంగారెడ్డి మండల పరిధిలోని నక్క వాగు పరివాహ ప్రాంతంలో అక్రమ ఇసుక వ్యాపారులు నదికి ఇరువైపులా ఉన్న మట్టిని అక్రమంగా తీసి వర్షాకాలంలో మునిగిపోకుండా సమీపంలోని ఎత్తైన ప్రదేశంలో నిల్వ చేస్తున్నారు. దీంతో వర్షాకాలంలో సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా కృత్రిమంగా ఇసుక తయారు చేసి కోట్ల రూపాయల వ్యాపారం కొనసాగించవచ్చని ఉద్దేశంతో వ్యాపారులు నిల్వ చేస్తున్నారు. ఇది ఒక్కరోజు తవ్వకంతో ఇంత పెద్ద కుప్పలుగా కనిపించేవి కావు.... రోజుల తరబడి తవ్వి మట్టిని నిల్వ చేస్తున్న జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న ఇస్మాల్ ఖాన్ పేట పై రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు దృష్టి పెట్టలేకపోతున్నారు . ఇందుకు అక్రమ వ్యాపారులు నెలవారీగా వివిధ శాఖల అధికారులకు మామూలు ఇవ్వడంతోనే కొన్ని సందర్భాలలో పట్ట పగలు కూడా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇసుక తయారు కోసం వ్యాపారులు అక్రమంగా విద్యుత్ వినియోగించడంతో పాటు బోర్ మోటార్లను సైతం వాడుతున్నారు. ఒకవైపు అధికారులు అక్రమ ఇసుక రవణాను ఎట్టి పరిస్థితుల్లో ఉపయోగించేది లేదని.... కఠిన చర్యలు తప్పవంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్న అధిక్షేత్ర స్థాయిలో ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీనికి ఉదాహరణగా ఇస్మాల్ ఖాన్ పేట, బ్యాతోల్, ఎర్దనూర్ గ్రామంలో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయల గండి పడుతుంది. ఎప్పుడైనా అనుకోని పరిస్థితుల్లో స్పెషల్ డ్రైవ్ అని నిర్వహించి జరిమానాలు వేస్తే మాత్రం సిండికేట్ అవుతున్న ఇసుక వ్యాపారులు అందరు కలిసి డబ్బులు చెల్లించి సీజయిని వాహనాలను బయటకు తీసుకువచ్చి యధావిధిగా తిరిగి వ్యాపారాలను కొనసాగిస్తున్నారు.


## నివాస గృహాలు 150.. టిప్పర్లు, జెసిబి లు మాత్రం 50 పైగానే..

హనుమాన్ నాయక్, దాస్ గడ్డ తండా అంటే నిన్నటి వరకు ఇస్మాయిల్ ఖాన్ పెట్ గ్రామపంచాయతీ పరిధిలోకి వచ్చేది. కొత్త పంచాయతీలు ఏర్పాటుతో హన్ మాన్ నగర్ కొత్తగా గ్రామపంచాయతీ ఏర్పడింది. ఇక్కడ 1505 నివాస గృహాలు ఉంటాయి. కానీ ప్రతి ఇంటికి కారు అనేది సహజమే కానీ ఇక్కడ ప్రత్యేకంగా ప్రతి ఇంటికి రెండు నుంచి ఐదు డంపర్లు, సగటున రెండు జెసిబి లు మాత్రం ఉండడం విశేషం. ఈ గ్రామానికి వ్యవసాయ భూమి కూడా అంతగా లేదు. ఈ గ్రామపంచాయతీ చుట్టూ కూడా ఉన్నది అంతా అసైన్మెంట్ భూమి. అయినా దర్జాగా అక్రమంగా మట్టి రవణ తో పాటు ఇసుక రవాణా చేస్తూ కోట్ల రూపాయల సంపాదిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సహజ వనరులను దోచుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# చిత్రకళతో ఊరికి పేరు తెస్తున్న అక్క చెల్లెలు



- రంగుల్లో ఊరినే ఆవిష్కరిస్తున్న అమీనాబాద్ చిన్నారులు
- పోటీల్లో పాల్గొనలేదు.. బహుమతులు అందుకోలేదు.. అయినా ప్రజల మెప్పే వారి గుర్తింపు
- ఇంటి గోడలే కాన్వాస్.. పాత నోటుపుస్తకాలే రంగుల పలకలు
- రైతు కష్టం నుంచి పల్లె అందాల వరకు.. కుంచెతో కథలు చెబుతున్న సనా,హనీష










**ప్రజా వాయిస్,అనంతగిరి:** కాగితంపై ఓ గీత పడింది.. అది క్రమంగా ఓ దృశ్యంగా మారింది. రంగులద్దిన ఆ దృశ్యం చూస్తే.. కళ్లముందే ఓ కథ కదలాడుతున్న అనుభూతి. చిన్న చేతుల్లోని బ్రష్.. పెద్ద ఊహలకు రూపమిస్తోంది. పల్లె జీవితాన్ని, ప్రకృతి అందాలను, రైతు కష్టాన్ని, పండుగల సందడిని రంగుల్లో బంధిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు అనంతగిరి మండలం అమీనాబాద్‌కు చెందిన అక్కాచెల్లెళ్లు గరిడేపల్లి సనా, గరిడేపల్లి హనీష. చిన్న వయసులోనే చిత్రలేఖనంపై ఆసక్తి పెంచుకున్న వీరిద్దరూ ఎలాంటి ప్రత్యేక శిక్షణ లేకుండానే తమ ప్రతిభకు పదును పెట్టుకున్నారు. స్కూల్ నుంచి ఇంటికి రాగానే పుస్తకాలను పక్కన పెట్టి బ్రష్, రంగులు చేతబట్టి తమ ఊహలకు ప్రాణం పోస్తున్నారు. ఇంటి గోడలు, పాత నోటుపుస్తకాలు, దొరికిన ప్రతి కాగితం వీరి కళకు కాన్వాస్‌గా మారుతున్నాయి.

**ఊరే గ్యాలరీ..ప్రజలే జడ్జీలు**

సాధారణంగా ప్రతిభను నిరూపించుకోవాలంటే పోటీలు బహుమతులు సర్టిఫికెట్లు అవసరం. కానీ సనా, హనీషలకు అవేవీ లేవు. ఇప్పటివరకు పెద్దగా పోటీల్లో పాల్గొనలేదు. బహుమతులు కూడా అందుకోలేదు. అయినా వారి కుంచెకు అమీనాబాద్‌లో మంచి గుర్తింపు వచ్చింది.అక్క వేసే ప్రకృతి దృశ్యాల్లో పల్లె పచ్చదనం కనిపిస్తే.మీ చెల్లెలు వేసే మనుషుల చిత్రాల్లో భావాలు పలుకుతాయి. రైతు నాగలి పట్టిన దృశ్యం, సంక్రాంతి ముగ్గులు, వర్షంలో తడుస్తున్న పిల్లలు, పల్లె వాతావరణం ఇలా తమ చుట్టూ కనిపించే ప్రతి దృశ్యాన్ని రంగుల్లోకి మార్చుతున్నారు.అమీనాబాద్ బజారులోనో గుడి దగ్గరో ఈ అక్కాచెల్లెళ్ల గురించి మాట్లాడుకుంటూ కనిపించే గ్రామస్థుల మాటలే వారికి పెద్ద పురస్కారం.మన ఊరి పిల్లలు ఇంత బాగా బొమ్మలు వేస్తున్నారా అంటూ పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

**ఇంట్లోనే మొదలైన కళాయాత్ర**

వీరికి ప్రత్యేకంగా చిత్రలేఖనం నేర్పిన గురువు ఎవరూ లేరు.పుస్తకాల్లోని బొమ్మలను చూసి, యూట్యూబ్‌లో చిత్రలేఖన వీడియోలను వీక్షించి స్వయంగా నేర్చుకున్నారు. అక్క సనా బొమ్మలు వేయడం చూసి చెల్లెలు హనీష కూడా ఆసక్తి పెంచుకుంది. ఒకరి బొమ్మలను మరొకరు పరిశీలించుకుంటూ తప్పులను సరిదిద్దుకుంటూ కొత్త కొత్త పద్ధతులను ప్రయత్నిస్తూ ముందుకు సాగుతున్నారు.మొదట్లో పిల్లల సరదాగా భావించిన తల్లిదండ్రులు రోజురోజుకూ వారి చిత్రాల్లో కనిపిస్తున్న పరిణతిని చూసి గర్వపడుతున్నారు. చదువుతో పాటు కళను ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మరింత రాణిస్తారని చెబుతున్నారు.

**మాటలకు అందని భావాలకు..రంగుల రూపం**

ఈ చిన్నారుల చిత్రాల్లో కేవలం రంగులు మాత్రమే ఉండవు. ఒక సందేశం ఉంటుంది. ఒక భావం ఉంటుంది. రైతు చెమటలోని కష్టం పండుగలోని ఆనందం వర్షం కోసం ఎదురు చూసే రైతు ఆవేదన ప్రకృతిపై ప్రేమ ఇలా మాటల్లో చెప్పలేని ఎన్నో భావాలకు వీరి బ్రష్ రూపమిస్తోంది.ఒక బొమ్మను గీసి పక్కన పెట్టడం కాదు.. దాన్ని చూసే వ్యక్తి కాసేపు ఆగి ఆలోచించేలా చేయాలన్నదే వీరి ప్రయత్నం.

**నలుగురు మెచ్చుకుంటే చాలు..పోటీల్లో గెలవాలని..**

పెద్ద పెద్ద బహుమతులు సాధించాలని కాకుండా.. తమ చిత్రాలను చూసిన నలుగురు ఆనందిస్తే చాలని ఈ అక్కాచెల్లెళ్లు అంటున్నారు. భవిష్యత్తులో మంచి చిత్రకారులుగా ఎదిగి.. తమ కళ ద్వారా సమాజానికి మంచి సందేశాలు ఇవ్వాలన్నది వారి కల.సర్టిఫికెట్లు లేవు.. బహుమతులు లేవు.. కానీ ప్రజల అభిమానం ఉంది.వేదికలు లేవు.. గ్యాలరీలు లేవు.. కానీ ఊరంతా వారి కళకు గ్యాలరీగా మారింది.చిన్న చేతుల్లోని బ్రష్‌తో పెద్ద కలలకు బొమ్మలు వేస్తున్న అమీనాబాద్ అక్కాచెల్లెళ్లు.. ప్రతిభకు అవకాశం దొరికితే పల్లెల్లోనూ అద్భుతమైన కళాకారులు పుడతారని నిరూపిస్తున్నారు.

## బోనాల సందడి..
## నేడు భద్రాద్రి ప్రజావాణి రద్దు!

- కలెక్టరేట్‌కు రావద్దని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ వెల్లడి



**ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం:**తెలంగాణ సంస్కృతి అద్దం పట్టే బోనాల పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు.బోనాల పండుగకు ప్రభుత్వ అధికారిక సెలవు ఉన్నందున, ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనాల్సిన వివిధ జిల్లాల శాఖల అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరని కలెక్టర్ వెల్లడించారు. ప్రజలకు అవరోధం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ వారం ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలు, ఫిర్యాదులను విన్నవించుకునేందుకు సోమవారం నాడు కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని జిల్లా ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. తిరిగి వచ్చే వారం సాధారణ రోజుల్లో యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలు ఈ మార్పును గమనించి సహకరించాలని ఆయన కోరారు.





## బతుకు అడవిలో.. అభివృద్ధి ఊహల్లో


- విద్య, వైద్యం, రహదారి, తాగునీటికీ దిక్కులేదు
- ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ఆదివాసీల ఆగ్రహం
- పట్టించుకోని ప్రభుత్వాలు అవస్థలో ఆదివాసులు

**ప్రజా వాయిస్, తాండూర్/బెల్లంపల్లి:** ఆదివాసీ గూడేలు అస్తిత్వాన్ని కోల్పోతున్నాయని, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని సీపీఎం తాండూర్ మండల కార్యదర్శి దాగం రాజారాం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా తాండూర్ మండలం నర్సాపూర్ గ్రామంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంఘం మండల అధ్యక్షుడు ఆత్రం బాదిరావు జెండా ఆవిష్కరించారు.ఆదివాసీల జీవన విధానం అడవితో ముడిపడి ఉందని, అయితే అభివృద్ధి పేరుతో జరుగుతున్న ప్రైవేటీకరణ, ప్రపంచీకరణతో వారు క్రమంగా అడవికి దూరమవుతున్నారని రాజారాం అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నేటికీ విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏటా ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నప్పటికీ గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించడం లేదని విమర్శించారు. ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలకు రక్షణ కల్పించడంతో పాటు వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.గిరిజన ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆదివాసీలను ఐక్యం చేసి ఉద్యమాలు చేపడతామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కురిసింగ బీదర్, తూరం జంగు, కోట్నాక శ్యామ్‌రావు, దూరం జలపత్, సోయం జంగు, సోయం పర్వతిరావు, కోట్నాక రాజేష్, కోరింగ సాయి, దూరం ప్రమీల, కురిసింగ జంగుబాయి, తోయా ఈశ్వరి, సామల అర్జున్‌బాయి, సోయం సంతోష్, తూరం కాసుబాయి, కురిసింగ బొజ్జల, కేంద్రం కవితతో పాటు పలువురు ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

## పొలానికి వెళ్లేదెలా?

- బురద బాటలో దిగబడుతున్న ట్రాక్టర్లు
- మేము వ్యవసాయం ఎలా చేసుకోవాలి?
- పంట సాగు పనులు ఆలస్యము- సూరయ్యపల్లి రైతుల ఆవేదన!

**ప్రజా వాయిస్ మంథనిపెద్దపల్లి జిల్లా** మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలో వ్యవసాయం చేసే రైతులకు పొలానికి వెళ్లే రహదారి తీవ్ర నరకాన్ని చూపిస్తోంది. వానకాలం సాగు పనులు ముమ్మరమైన వేళ, చేన్లకు వెళ్లే బాటలు అధ్వానంగా తయారవ్వడంతో పంట పొలాలకు వెళ్లలేక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొలం బాటలన్నీ తీవ్రంగా బురదమయంగా మారాయి. ఎంతలా అంటే.. వ్యవసాయ పనుల కోసం పొలాల్లోకి వెళ్లాల్సిన ట్రాక్టర్లు మధ్యలోనే బురదలో కూరుకుపోతున్నాయి. ట్రాక్టర్లు కూడా రాకపోవడంతో విత్తనాలు, ఎరువులు, సాగు సామాగ్రినంతా చేన్లకు చేర్చడం రైతులకు గగనతలమవుతోంది. దిగబడిన ట్రాక్టర్లను బయటకు తీయడానికే గంటల కొద్దీ సమయం పడుతోందని, దీనివల్ల వేలకు వేలు అదనపు ఖర్చులతో పాటు విలువైన సమయం వృథా అవుతోందని రైతులు వాపోతున్నారు."మా పొలాలకు వెళ్లేందుకు కనీస రహదారి సదుపాయం లేక నరకం చూస్తున్నాం. ట్రాక్టర్లు కూడా రాలేని ఈ బురద బాటలో మేము వ్యవసాయం ఎలా చేసుకోవాలి?" అని సూరయ్యపల్లి రైతులు ప్రశ్నిస్తున్నారు. సరైన బాట లేక పంట సాగు పనులు ఆలస్యమవుతున్నాయని, తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సూరయ్యపల్లి గ్రామ పొలం బాటలకు గ్రహణమొదిలేలా, కనీసం ముగ్గు లేదా గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టి తమను ఆదుకోవాలని గ్రామానికి చెందిన రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## డప్పు మోగింది.. ఊరు ఊగింది!

- కే.ఎన్.ఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల వేడుకలు
- సరికొత్త డప్పుల విన్యాసాలతో ఊరంతా ఉత్సాహం
- కొత్త కుండల్లో బోనాలు
- సాంప్రదాయ వస్త్రధారణలో మహిళల సందడి
- అమ్మవారికి నైవేద్యాలు సమర్పించిన మహిళలు
- గ్రామ సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు

**చేవెళ్ల(ప్రజావాయిస్) :** మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో కే.ఎన్.ఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మహిళలు కొత్త కుండల్లో బోనాలను తయారు చేసి, పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించి సాంప్రదాయ వస్త్రధారణలో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.బోనాల వేడుకల్లో సరికొత్త డప్పులతో కళాకారులు చేసిన వినూత్న విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పుల దరువులకు అనుగుణంగా కళాకారులు ప్రదర్శించిన విన్యాసాలను చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా తిలకించారు. డప్పుల మోతతో కేతిరెడ్డిపల్లి వీధులు మార్మోగగా, యువత, మహిళలు, చిన్నారులు కేరింతలతో వేడుకల్లో సందడి చేశారు.అమ్మవారి వేషధారణలో కళాకారులు చేసిన ప్రదర్శనలు, శివసత్తుల పూనకాలు, సంప్రదాయ విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో గ్రామమంతా భక్తి, ఆనందోత్సాహాలతో ప్రత్యేక పండుగ శోభను సంతరించుకుంది.అనంతరం మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. కే.ఎన్.ఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలు భక్తి, సంప్రదాయం, సాంస్కృతిక సందడితో ఘనంగా సాగాయి. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీనివాస్‌పై పోలీసుల దాష్టీకం!

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- పోలీస్‌స్టేషన్ ఎదుట బాధిత కుటుంబం, రైతు సంఘాల ఆందోళన

**ప్రజావాయిస్ / మోమిన్‌పేట్:** భూ వివాదం కేసులో అరెస్టయిన బూరుగుపల్లి గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్‌ను పోలీసులు తీవ్రంగా కొట్టి హింసించారని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు, రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, దళిత సంఘాల నాయకులు మోమిన్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు.శ్రీనివాస్‌పై ప్రత్యర్థులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసులు నమోదు చేసి అరెస్టు చేశారని, తమ ఫిర్యాదులను మాత్రం పోలీసులు పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆగస్టు ఆరో తేదీన అరెస్టు చేసి కోర్టుకు తరలించిన అనంతరం పరిగి జైలుకు తీసుకెళ్తున్న మార్గంలో పోలీసులు తన భర్తను చేతులు, చెప్పులు, బెల్టులు, కర్రలతో తీవ్రంగా కొట్టారని శ్రీనివాస్ భార్య వసంత ఆరోపించారు.జైలు నుంచి విడుదలైన శ్రీనివాస్ నడవలేని స్థితిలో ఉండటంతో తొలుత వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో, అనంతరం ప్రైవేట్ నరాల వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.శ్రీనివాస్‌పై దాడికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న మోమిన్‌పేట్ ఎస్సై భరత్‌భూషణ్‌తో పాటు సంబంధిత పోలీసు సిబ్బందిపై సమగ్ర విచారణ జరిపి, హత్యాయత్నం, ఎస్సీ–ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. తమ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తున్న మంతనకాడి కృష్ణంరాజు, మంతనకాడి విక్రంరాజులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని, న్యాయం చేయకపోతే జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాసయ్య, కే.బాబు, ఎన్.బాబు, మానేయ, కుటుంబ సభ్యులు వసంత, మేకల దశరథ్, అశోక్, శేఖర్, రామయ్య, ఎన్.శేఖర్, ఎన్.ముత్యాలు, మహిపాల్, ఎస్.ప్రభు రాజు తదితరులు పాల్గొన్నారు.




## డబ్బుల కోసం ఎంతకైనా తెగిస్తారా..?

- పెళ్లి పేరుతో కుటుంబాల్లో చిచ్చు పెడుతున్న ఆ 'పెద్దమనుషులు' ఎవరు..?
- ఇప్పటికైనా తమ పద్ధతి మార్చుకోవాలని ఆయేషా ఫాతిమా హెచ్చరిక



**ప్రజా వాయిస్ మంథని** సమాజంలో గౌరవప్రదమైన హోదాలో ఉంటూ, ధర్మబద్ధంగా నడుచుకోవాల్సిన కొందరు వ్యక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం దిగజారుతున్నారా..? బాధ్యతాయుతమైన స్థానాలను అడ్డుపెట్టుకుని అమాయకులను వాడుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారా..? మనవరాలి పెళ్లి పేరుతో లక్షలు దోచుకోవడమే లక్ష్యంగా, ఒక నిండు కుటుంబంలో చిచ్చు రగిల్చారనే వ్యవహారంపై ఆయేషా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు కమిటీ సభ్యుల తీరును తీవ్రంగా ఖండిస్తూ, ఇప్పటికైనా వారి ప్రవర్తన మార్చుకోవాలని హితవు పలికారు.బాధ్యతల ముసుగులో స్వార్థ రాజకీయాలు..?సమాజంలో పెద్దమనుషులు గా చెలామణి అవుతున్న సదరు కమిటీకి చెందిన కొందరు సభ్యులు, కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని ఆయేషారఫీ దుయ్యబట్టారు. సహాయం చేసిన వారు ఏమైపోయినా పర్వాలేదనే రీతిలో ప్రవర్తిస్తూ నిండు సంసారాల్లో నిప్పులు పోస్తున్నారని, ఇటువంటి చర్యలు తీవ్రంగా నిరసించదగినవని స్పష్టం చేశారు.



# ఆర్ఎంపీ వైద్యుడిపై మహిళ ఆగ్రహం

- మందుల విషయంలో వాగ్వాదం

**ప్రజా వాయిస్ టేక్మాల్:** ఆర్ఎంపీ వైద్యుడి వద్ద మందుల విషయంలో ఓ మహిళ ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన టేక్మాల్‌లో చోటుచేసుకుంది. వైద్యుడు ప్రిస్క్రిప్షన్‌లో ఒక మందు రాసి, మరో టాబ్లెట్ ఇచ్చాడంటూ వైద్యుడి తో గొడవకు దిగింది.ప్రిస్క్రిప్షన్‌లో సూచించిన మందుకు బదులుగా వేరే టాబ్లెట్ ఇవ్వడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయంపై వైద్యుడిని నిలదీయ డంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది.రాసిన మందులు కాకుండ వేరే మందులు ఎందుకు ఇచ్చారని మహిళ డాక్టర్ ను ప్రశ్నించింది.. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.అలాగే వైద్యుడు వైద్యంతో పాటు మందులు కూడా తనే అమ్ముతున్నాడని గ్రామంలో పలువురు ఆరోపించారు. మందుల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్న ఆర్ఎంపీ డాక్టర్ పై, ఆయన చేస్తున్న వైద్య సేవలను జిల్లా అధికారులు పరిశీలించి వైద్యుడిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# వామ్మో అంతా దోపిడి రాజ్యమేనా!?

- నిత్యవసర వస్తువుల ధరల పట్టిక లేకుండా విక్రయాలు!
- అంత జీరో బిల్లుపై కోట్ల వ్యాపారం కొనసాగిస్తున్న వైనం!?
- వేరువేరు దుకాణాలలో వేరువేరు ధరలు పలుకుతున్న పరిస్థితి?
- పేట మున్సిపాలిటీ అయిన స్పందన కరువంటూ వినియోగదారులు మండిపాటు!
- ప్రభుత్వ యంత్రాంగం విధినిర్వాహన తప్ప ఆదేశాలు నీల్?
- అయ్యా మున్సిపల్ సాబ్ దుకాణాల ముందు ధరలు ప్లెక్సీలను ఏర్పాటు చేసే చర్యలు చేపట్టండి!?





**ప్రజా వాయిస్ అశ్వారావుపేట** ప్రస్తుత పరిస్థితులలో మనుగుడు కొనసాగించాలంటే నిత్యవసర వస్తువులు ప్రధానం ఇటువంటి వాటికి ధరలు నిర్ణయించి ప్రజలకు అందించే విధంగా పలు ప్రవేట్ సెక్టార్లు దళారి వ్యవస్థ దోపిడీ రాజ్యాంగ మారి అమాయక ప్రజల వద్ద నుండి అధిక మొత్తంలో దోచుకుంటున్నారు వీటి ధర నియంత్రణలో భాగంగా ప్రభుత్వం సైతం పలు శాఖలను కేటాయించి వాటికి అధికారులను సైతం నియమించి లక్షల రూపాయలు జీతాలు సైతం అందిస్తున్నారు. దీంతో అధికారులు ధరలు నియంత్రణ ప్రక్రియ కొనసాగిస్తూ అధిక ధరలతో నిత్యవసర వస్తువులను క్రైమ్ విక్రయాలు జరిపిన వారిపై కేసులు సైతం నమోదు చేయటం కొనసాగిస్తుంటారు ప్రస్తుత పరిస్థితులలో కొందరు బడా వ్యాపారస్తులు వారు నిర్ణయించిన రేట్లకే నిత్యవసర వస్తువులను అమాయక ప్రజలకు అంటగడుతూ కోట్ల గడిస్తున్న అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరనట్లు వ్యవహరిస్తుంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలోని సామాన్యులకు కావలసిన నిత్యవసర వస్తువులను నచ్చిన రీతిలో వారు నిర్ణయించిన రేట్లకే క్రైమ్ విక్రయాలు జరుపుకుంటున్న పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం మౌనం వహించటం వెనుక అంతర్గత రహస్యం ఏమిటో అమాయక ప్రజలకు నేటికీ తెలిసే పరిస్థితి కనిపించడం లేదు ఉప్పు నుండి కట్టుకునే దుస్తులు వరకు వారి నిర్ణయించిన రేట్లకే క్రైమ్ విక్రయాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు

## దుకాణాల ముందు జాడ లేని ధరల పట్టికలు!

అశ్వారావుపేట పట్టణంలోని సుమారు వందల నుండి వేల పలు రకాల దుకాణాలు నిత్యం వివిధ వస్తువులను విక్రయాలు జరిపిస్తూనే ఉంటారు వీటిలో ముఖ్యంగా పప్పు నుండి బియ్యం ఆయిల్ పెన్నా పుస్తకాలు కూరగాయల రేట్లు ఒక దుకాణం నుండి మరో దుకాణానికి 20 రూపాయల నుండి 50 రూపాయలు మేరకు తేడా ఉన్నప్పటికీ వాటి అసలు ధరలు మాత్రం నేటికీ సామాన్యులకు తెలిసే పరిస్థితి ఉండదు అంటే వ్యాపారస్తులు అందరూ కలిసి వారికి తోచిన విధంగా రేట్లు నిర్ణయించి క్రైమ్ విక్రయాలు జరుపుకోవడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా కొనసాగుతుంది.

## కొత్తగా మున్సిపాలిటీ అయిన ఆదేశాలు మాత్రం శూన్యమే!?

అశ్వారావుపేట పట్టణం నుండి మున్సిపాలిటీ అయ్యి ప్రత్యేక అధికారి విధులు నిర్వహిస్తున్న నేటికీ ఇటువంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించిన సందర్భం లేదని భారీ స్థాయిలో విమర్శలు ఉన్నాయి అంతేకాకుండా పట్టణంలోని ఆదాయం సమకూర్చుకునే పనిలో అధికార యంత్రాంగం ఉన్నప్పటికీ నిత్యవసర వస్తు ధరలపై ఎందుకు అధికారి యంత్రం చిన్నచూపు చూస్తుందో తెలియదని సామాన్యులను నిలువు దోపిడీ చేస్తున్న వ్యాపారస్తులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు దీని వెనక అంతర్గత రహస్యం ఏమిటో తెలియదని సీనియర్ సిటిజన్ సైతం అధికారులపై మండిపడుతున్నారు.

## మచ్చుకైన కానరాని తనిఖీ మరియు ధరల నియంత్రణ అధికారులు!

పట్టణంలోని వందల నుండి వేల దుకాణాలు లో నిత్యవసర వస్తువులు అధిక ధరలతో క్రీమీ విక్రయాలు జరుగుతున్న తనిఖీలు చేసే అధికారులు కానీ క్వాలిటీ అధికారులు గాని కనిపించని దాఖలాలు ఉండవు. నిత్యవసర వస్తువులే కాకుండా ఇంటి నిర్మాణానికి కావలసిన వస్తువులు మరియు తునికీలు వేసే విధానాలపై తనిఖీలు చేసే అధికారి యంత్రాంగం కరువయ్యారని చెప్పుకోవచ్చు ఏది ఏమైనా పేట నందు అసలు కంటే నకిలీలే ఎక్కువగా క్రైమ్ విక్రయాలు జరుగుతున్న పట్టించుకునే నాధుడు కరువయ్యాడని అంతేకాకుండా కనీసం మున్సిపల్ అధికారులు సైతం కార్యాలయాలకే తప్ప విధి నిర్వహణలో కొనసాగించిన దాఖలాలు లేవని అశ్వారావుపేట పట్టణం వాసులు తీవ్రంగా విమర్శిస్తున్నారు జిల్లా కలెక్టర్ చొరవతో ఇటువంటి విధానానికి చరణ గీతం పాడాలని అశ్వారావుపేట పట్టణవాసులు కోరుకుంటున్నారు.



# బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలి

### ఐద్వా, డీవైఎఫ్ ఐ, వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజా వాయిస్ కగజ్ నగర్ కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం బట్టుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, డీవైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం సర్పంచ్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి దుర్గం అనిత మాట్లాడుతూ.. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరగడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని అన్నారు. మద్యం అందుబాటులో ఉండటంతో యువత వ్యసనాలకు లోనవుతున్నారని, కుటుంబాల్లో గొడవలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.బెల్ట్ షాపుల వల్ల మహిళలు, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామాల్లో అనధికారిక మద్యం విక్రయాలను అరికట్టి, బట్టుపల్లి పరిధిలోని బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయాలని అధికారులను డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే దశలవారీగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాచర్ల వినోద, కోశాధికారి షాహిని, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, ఉపాధ్యక్షుడు దుర్గ నిఖిల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ముంజం ఆనంద్, ఆర్టీఏ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌తో పాటు మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే జయవీర్ సందడి

- బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ ప్రతీక
- ఘనంగా మొలకల పండుగ వేడుకలు
- బంజారా సోదర, సోదరీమణులతో కలిసి సంబరాల్లో ఎమ్మెల్యే
- సంప్రదాయాలను భావితరాలకు అందించాలిపెద్ద సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు

**ప్రజా వాయిస్, అనుముల**.బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన తీజ్ (మొలకల) పండుగ వేడుకలు ఆదివారం నందికొండ మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బంజారా సోదర, సోదరీమణులతో కలిసి తీజ్ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారా సమాజ ప్రజలకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తరతరాలుగా వస్తున్న బంజారా సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవడంతో పాటు వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తీజ్ పండుగ సందర్భంగా బంజారా మహిళలు, యువత సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సోషల్ మీడియా సభ్యులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ యువజన నాయకులు, పట్టణ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పట్టణ నాయకులు, బంజారా సోదర, సోదరీమణులు పాల్గొన్నారు.





# రామగిరిఖిల్లా శివారులో ఇండస్ట్రియల్ పార్క్

- రూ.1.10 కోట్లతో ఫెన్సింగ్ పనులు ప్రారంభం
- 280 ఎకరాల్లో భూసేకరణ
- మంత్రి శ్రీధర్ బాబు పరిశీలన

**ప్రజా వాయిస్ రామగిరి** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని మేడిపల్లి–రామగిరిఖిల్లా శివారులో ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి భూసేకరణ పూర్తయింది. రత్నాపూర్ గ్రామానికి చెందిన రైతుల నుంచి పట్టా, ప్రభుత్వ భూములు కలిపి సుమారు 280 ఎకరాలను సేకరించారు. ఈ భూముల్లో పలు పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ నెల 03న ఈ ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. రూ.1.10 కోట్లతో ఫెన్సింగ్, ప్రీ–కాస్ట్ వాల్ నిర్మాణం ఇండస్ట్రియల్ పార్క్ భూమి చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణ పనులకు టెండర్లు పూర్తయి, పనులు కూడా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఈ పనులకు రూ.1.10 కోట్ల నిధులు కేటాయించగా, హైదరాబాద్‌కు చెందిన సివిజన్ కంపెనీ టెండర్లను దక్కించుకుంది. ఇందులో భాగంగా శ్రీరామ్ సాగర్ కాలువ నుంచి పల్లె ప్రకృతి వనం వరకు సుమారు 500 మీటర్ల మేర ప్రీ–కాస్ట్ వాల్ నిర్మించనున్నారు. అలాగే, ఆరు కిలోమీటర్ల సరిహద్దు చుట్టూరా 5 వైర్లతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు

## స్థానిక ప్రజాప్రతినిధుల హర్షం

పరిశ్రమల ఏర్పాటు దిశగా నిధులు మంజూరు చేసి, రక్షణ గోడ మరియు ఫెన్సింగ్ పనులను త్వరితగతిన ప్రారంభించడం పట్ల రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పివీరావు ప్రత్యేక హర్షం వ్యక్తం చేశారు.

# సాగర్ ఎడమ కాలువకు నీళ్లివ్వాలి

- రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యం కావాలి
- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ డిమాండ్

**ప్రజా వాయిస్ / నల్లగొండ క్రైమ్**: నాగార్జునసాగర్ జలాశయానికి వరద నీరు వస్తున్న నేపథ్యంలో సాగర్ ఎడమ కాలువకు వెంటనే సాగునీటిని విడుదల చేసి ఖరీఫ్ పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ డిమాండ్ చేశారు. జలాశయం నిండుతున్నా వరి సాగుకు నీళ్లు ఇవ్వబోమంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రైతాంగాన్ని నిరాశకు గురిచేస్తున్నాయని ఆయన విమర్శించారు.సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల చేయాలిసాగర్ ఎడమ కాలువ కింద వేలాది ఎకరాల ఆయకట్టు ఉందని, ఖరీఫ్‌లో వరి సాగు చేసుకునేందుకు రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని భగత్‌కుమార్ అన్నారు. శ్రీశైలం, తుంగభద్ర, ఆలమట్టి తదితర జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని అంచనా వేసి సాగర్‌కు నీటిని తరలించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి లభ్యతను అంచనా వేసి ఖరీఫ్ నారుమళ్ల కోసం సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసిందని గుర్తుచేశారు.

## యూరియా కోసం రైతుల అవస్థలు

రైతులకు అవసరమైన యూరియాను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భగత్‌కుమార్ ఆరోపించారు. యాప్‌లో యూరియా అందుబాటులో ఉన్నట్లు చూపిస్తూ దుకాణాల్లో మాత్రం స్టాక్ లేకుండా చేశారని, ఒక బస్తా యూరియా కోసం రైతులు ఫర్టిలైజర్ దుకాణాలు, పీఏసీఎస్ కార్యాలయాల ఎదుట గంటల తరబడి క్యూలో నిలబడిన పరిస్థితులను రైతులు ఇప్పటికీ మర్చిపోలేదన్నారు. రైతు భరోసా విషయంలోనూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు.




## కృష్ణా, గోదావరి జలాల వినియోగంలో వైఫల్యం

కృష్ణా, గోదావరి నదీ జలాలను సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని భగత్‌కుమార్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లను వినియోగించి గోదావరి జలాలను ఎత్తిపోసే ప్రయత్నం చేయడం లేదని, మరోవైపు కృష్ణా జలాల విషయంలోనూ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం నీటిని తరలిస్తున్నా తెలంగాణ ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు.

## రైతు సంక్షేమంపై చిత్తశుద్ధి ఏది?

రైతు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం సన్న రకం ధాన్యానికే బోనస్ పరిమితం చేస్తోందని భగత్‌కుమార్ ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ కూడా రైతుల ఖాతాల్లో సక్రమంగా జమ కావడం లేదన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి, ఆ హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.

## వరుణ యాగం చేస్తే సరిపోదు

రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని వరుణ యాగాలు నిర్వహిస్తున్న ప్రభుత్వం, జలాశయాల్లోకి నీరు చేరుతున్న సమయంలో రైతులకు సాగునీరు ఇవ్వకపోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని భగత్‌కుమార్ అన్నారు. శ్రీశైలం జలాశయంలోని నీటిని జలవిద్యుత్ ఉత్పత్తికి వినియోగించడం ద్వారా విద్యుత్‌తో పాటు సాగర్ జలాశయానికి నీటిని తరలించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే సాగర్ ఎడమ కాలువకు సాగునీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# దళిత రైతుకు న్యాయం చేయాలి

- చన్ గోముల్ ఎస్సై భరత్ కుమార్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు ఎందుకు లేవు?
- రూల్ ఆఫ్ లా అంటే ఇదేనా..ఎస్పీ సమాధానం చెప్పాలి
- ఆగస్టు 17న ఎస్పీ కార్యాలయం ముట్టడిస్తాం
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య

**ప్రజావాయిస్/వికారాబాద్:** పూడూర్ మండలం సోమన్‌గుర్తి గ్రామానికి చెందిన దళిత రైతు జైదుపల్లి నర్సిములు భూమి విషయంలో న్యాయం చేయకుండా, బాధితుడిపైనే అక్రమ కేసు నమోదు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న చన్ గోముల్ ఎస్సై భరత్ కుమార్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కేవీపీఎస్ తదితర ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు ఆదివారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తూరు చంద్రయ్య, కే ఎన్ పి ఎస్ జిల్లా నాయకులు మాట్లాడుతూ ...సోమన్‌గుర్తి గ్రామానికి చెందిన దళిత రైతు నర్సిములు తన పట్టా భూమిని యేసియు టైర్స్ కంపెనీ ఆక్రమించిందని ఫిర్యాదు చేసినప్పటికీ, బాధితుడికి రక్షణ కల్పించి భూమి ఆక్రమణపై విచారణ చేయాల్సిన పోలీసులు బాధితుడిపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం తీవ్ర అన్యాయమని అన్నారు.అధికార పార్టీ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి బంధంపై విచారణ జరపాలి. యేసియు టైర్స్ కంపెనీ డైరెక్టర్‌గా గతంలో ప్రస్తుత అధికార పార్టీకి చెందిన జడ్చర్ల ఎమ్మెల్యే అనురుద్రెడ్డి ఉన్నారనే విషయాన్ని నాయకులు ప్రస్తావిస్తూ, ఈ భూమి వివాదంలో రాజకీయ ప్రభావం లేదా అధికార దుర్వినియోగం జరిగిందా అనే అంశాన్ని కూడా స్వతంత్ర దర్యాప్తు సంస్థ ద్వారా విచారించాలని డిమాండ్ చేశారు.ఆగస్టు17 న కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, దళితులు, గిరిజనులు, విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చెంద్రప్ప, రామయ్య, మల్లప్ప, ఎంకప్ప,తదితరులు పాల్గొన్నారు.



# వరంగల్ జ్ఞాపకాలు.. పోలీసింగ్‌కు కొత్త సవాళ్లు

- నక్సలిజం నుంచి సైబర్ నేరాల వరకు పోలీసింగ్ లో భారీ మార్పు: డీజీపీ సి.వి. ఆనంద్
- మౌలిక పోలీసింగ్ పైనే ప్రధాన దృష్టి..
- డ్రగ్స్, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** ఒకప్పుడు నక్సలిజం పోలీసింగ్‌లో అతిపెద్ద సవాలైతే, ఇప్పుడు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, ఆర్థిక నేరాలు, రోడ్డు భద్రత ప్రధాన సవాళ్లుగా మారాయని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పనితీరును ఆదివారం సమీక్షించిన ఆయన, పోలీసింగ్‌లో సాంకేతికత ఎంత కీలకమైనా మౌలిక పోలీసింగ్‌ను విస్మరించరాదని అధికారులకు సూచించారు.జిల్లాలోని ఎన్ఐటీలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీసబ్ ), టీ-స్పార్క్, సీఐడీ అధికారులు సైబర్ నేరాల ధోరణులు, దర్యాప్తు విధానాలు, నూతన సాంకేతిక వ్యవస్థలపై ప్రజెంటేషన్ ఇచ్చారు.వరంగల్‌తో విడదీయరాని అనుబంధంతన ఐపీఎస్ ఉద్యోగ జీవితం వరంగల్‌లో జిల్లా శిక్షణతో ప్రారంభమైందని, అనంతరం వరంగల్ రూరల్ ఎస్పీగా పనిచేసిన రోజులు మరువలేనివని డీజీపీ గుర్తుచేసుకున్నారు. నక్సలిజం తీవ్రంగా ఉన్న రోజుల్లో ప్రతి రోజు ప్రమాదకరంగా ఉండేది . ల్యాండ్‌మైన్ పేలుళ్లు, దాడుల మధ్య పోలీసులు విధులు నిర్వర్తించే వారమని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో నేడు నెలకొన్న శాంతిభద్రతలు పోలీసు అమరుల త్యాగాల ఫలితమేనని పేర్కొన్నారు.సైబర్ మోసాలతో రూ.1,700 కోట్ల నష్టంగత ఏడాది తెలంగాణలో సైబర్ నేరాల వల్ల ప్రజలు సుమారు రూ.1,700 కోట్లు కోల్పోయారని డీజీపీ వెల్లడించారు. మోసపోయిన వెంటనే ఫిర్యాదు చేయకపోవడం వల్ల డబ్బు రికవరీ అవకాశాలు తగ్గుతున్నాయని చెప్పారు. అధిక లాభాల పేరుతో జరిగే పెట్టుబడి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### సైబర్ నేరాల నియంత్రణలో దేశంలోనే అగ్రస్థానం

సైబర్ నేరాల నియంత్రణలో ప్రధానమంత్రి ప్రగతి సమీక్షలో తెలంగాణకు దేశంలోనే తొలి స్థానం లభించిందని డీజీపీ తెలిపారు. సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

### మౌలిక పోలీసింగ్ కే ప్రాధాన్యం

సాంకేతికత పోలీసింగ్‌కు తోడ్పాటే కానీ ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులను వెంటనే స్వీకరించి పరిష్కరించాలని, దర్యాప్తులు, కోర్టు కేసుల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. డీసీపీలు, ఏసీపీలు, డీఎస్పీలు క్షేత్రస్థాయిలో ఎక్కువ సమయం గడుపుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

### యువత, చిన్నారులను లక్ష్యంగా డ్రగ్స్..

చాక్లెట్లు రూపంలో చిన్నారులను మాదకద్రవ్యాలకు అలవాటు చేసే ప్రయత్నాలు ఆందోళనకరమని డీజీపీ అన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ నివారణలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.20 శాతం ఖాళీలతో కమిషనరేట్వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజెంటేషన్‌లో కమిషనరేట్ పరిధిలో 50 పోలీస్ స్టేషన్లు ఉన్నాయని, 3,758 మంజూరైన పోస్టుల్లో 2,976 మంది మాత్రమే విధుల్లో ఉండగా 782 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. నేరాల నమోదు సుమారు 10 శాతం పెరిగినట్లు తెలిపారు.రైళ్లలో వచ్చి నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాలుబీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి రైళ్లలో వచ్చి వరంగల్, కాజీపేట కేంద్రంగా చైన్‌స్నాచింగ్, బైక్ చోరీలకు పాల్పడి వెంటనే వెళ్లిపోతున్న ముఠాలపై ప్రత్యేక నిఘా పెట్టామని కమిషనర్ వివరించారు. నాటగ్రిడ్ సహకారంతో సమాచార మార్పిడి, నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.'నేను సైతం'కు డీజీపీ ప్రశంసలుప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు చేపట్టిన 'నేను సైతం' కార్యక్రమాన్ని డీజీపీ అభినందించారు. ముఖ్యంగా నల్లబెల్లి, పర్వతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చేపట్టిన చర్యలను ప్రశంసించారు.పెరుగుతున్న దోపిడీలు, సైబర్ కేసులుదోపిడీ కేసులు 7 నుంచి 18కు, తాజాగా 29కు పెరుగుదల.సైబర్ మోసాల కేసులు 25 నుంచి 59కు, 2026 జనవరి-జూలైలోనే 119 కేసులు నమోదు.ఉద్యోగాల పేరుతో మోసాల కేసులు 40 నమోదయ్యాయి.ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్ )కు సంబంధించిన 117 కేసులు నమోదు అయ్యాయి.సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను మరింత విస్తరించి ప్రజల భద్రతను బలోపేతం చేయాలని డీజీపీ అధికారులను ఆదేశించారు.

**సమీక్షా సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, కమిషనరేట్ పరిధిలో పోలీసింగ్ పనితీరు, నేరాల పరిస్థితి, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, మహిళల భద్రత, ఆర్థిక నేరాల ధోరణులు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీజీపీకి వివరించారు.**





## అన్ని ఆయనే...? అప్పనంగా ఉద్యోగాన్ని సంపాదించి?

- అధికారులు.సిబ్బందిపై పెత్తనం ప్రతి పనికో రేటు
- సంపన్నుల జాబితాలో చేరినట్లు సమాచారం
- ఉన్నతాధికారులను మేనేజ్ చేయడంలో ఆయన దిట్ట?

**ప్రజా వాయిస్ హన్మకొండ** /పరకాల ప్రభుత్వ దావఖానలో ఆయన ఓ ఉద్యోగి అప్పనంగా ఉద్యోగాన్ని అప్పటి ఉన్నతాధికారుల అండదండలతో ఉద్యోగాన్ని సంపాదించి నేడు ఆ కార్యాలయ ఉన్నతాధికారుల సిబ్బందికి పెత్తందారుడయ్యాడు. ఉన్నతాధికారులకు ఎవరికి ఏం కావాలో వారిని ఎలా మేనేజ్ చేయాలో ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. దేవుడు వరమిచ్చిన పూజారి కనుకరించలే అన్న చందంగా అప్పనంగా ఉద్యోగం సంపాదించిన ఉద్యోగి రావాలనిపించినప్పుడే కార్యాలయానికి వస్తాడు. ఎవరన్నా ప్రశ్నిస్తే వారికి మనుగడ ఉండదు వివిధ హోదాల్లో పనిచేసి పదవి విరమణ పొందిన ఉన్నతాధికారుల అండ చూసుకొని ప్రభుత్వ దావఖనను శాసిస్తున్నాడు. ప్రతి పనికో రేటు పైసలు ఇయ్యందే పనులు చేయడు అనాది కాలంలోనే సంపన్న జాబితాలో ఆ ఉద్యోగి చేరినట్లు పట్టణవాసులు కార్యాలయ సిబ్బంది బహిర్గతంగా ఒకరితో ఒకరు ముచ్చడించుకోవడం చర్చనీయాంశంగా మారింది. అవినీతి రహిత సమాజ స్థాపన కోసం అహర్నిశలు పనిచేస్తున్న ప్రభుత్వం . స్థానిక శాసనసభ్యులు. జిల్లా కలెక్టర్ అవినీతి నిరోధక శాఖ అధికారులు. ప్రభుత్వ దవాఖాన పై దృష్టి పెడితే మరెన్నో అక్రమాలు బట్ట బయలైతాయని పట్టణవాసులు ప్రభుత్వ దావఖన సిబ్బంది వేడుకుంటున్నారు.

## తడకమల్లలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 12 మంది పట్టుబాటు
- రూ.6,600 నగదు, 12 సెల్ ఫోన్లు, రెండు బైక్ లు స్వాధీనం
- పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవు: రూరల్ ఎస్ ఐ లక్ష్మయ్య

**మిర్యాలగూడ,ప్రజా వాయిస్.** మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో పేకాట స్థావరంపై మిర్యాలగూడ రూరల్ పోలీసులు దాడి చేసి 12 మందిని పట్టుకున్నారు. రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో తడకమళ్ల గ్రామంలోని కంసాలి మణెమ్మకు చెందిన పాతబడిన ఇంట్లో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని దాడి నిర్వహించారు.ఈ దాడిలో పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6,600 నగదు, 12 సెల్‌ఫోన్లు, రెండు మోటార్‌సైకిళ్లు, పేకాటకు ఉపయోగించిన గ్రౌండ్ న్యూస్‌పేపర్ షీట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న వస్తువులతో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.గ్రామాల్లో పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా పేకాట ఆడుతూ పట్టుబడితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.



## కళ్యాణలక్ష్మి చెక్కు ఇప్పిస్తానని రూ.10 వేలు వసూలు

- దళారిని అదుపులోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించిన మంత్రి జూపల్లి
- దళారులను నమ్మి మోసపోవద్దు: మంత్రి జూపల్లి
- అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు
- లబ్ధిదారులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవు



**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా** వనపర్తి జిల్లావీపనగండ్ల కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల మండల కేంద్రంలో కళ్యాణలక్ష్మి చెక్కు ఇప్పిస్తానంటూ ఓ లబ్ధిదారుడి నుంచి రూ.10 వేలు తీసుకున్న దళారులు లబ్ధిదారుడి ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు.. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించారువీపనగండ్ల మండల కేంద్రంలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి తదితర సంక్షేమ పథకాల చెక్కులను మంత్రి జూపల్లి కృష్ణారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓ లబ్ధిదారుడు తనకు కళ్యాణలక్ష్మి చెక్కు ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి రూ.10 వేలు తీసుకున్నట్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే మంత్రి పోలీసులను పిలిపించి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు.దళారులను నమ్మి మోసపోవద్దు: ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు లబ్ధిదారులు దళారులను ఆశ్రయించవద్దని మంత్రి సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. పథకాల పేరుతో లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరికైనా ఇలాంటి అనుభవం ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు.



## సంఘం ఎన్నికల్లో ఘన విజయం

- ఆర్యవైశ్య నూతన సంఘం అధ్యక్షుడిగా నామ రవికిరణ్ గుప్తా విజయకేతనం..
- 77 ఓట్ల మెజార్టీతో భారీ గెలుపు

**.ప్రజా వాయిస్ జహీరాబాద్ :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు ఆదివారం నాడు రసవత్తరంగా సాగగా, మాజీ కౌన్సిలర్, ఆర్యవైశ్య సంఘం మాజీ కార్యదర్శి నామ రవికిరణ్ గుప్తా ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింలుపై 77 ఓట్ల మెజార్టీతో ఆయన విజయం సాధించారు.మొత్తం 314 ఓట్లకు గాను 303 ఓట్లు పోలయ్యాయి. ఇందులో నామ రవికిరణ్‌కు 189 ఓట్లు, అల్లాడి నర్సింలుకు 112 ఓట్లు లభించాయి. ఫలితాలను ఎన్నికల అధికారి వెంకటేశ్ ప్రకటించారు. నామ రవికిరణ్ ప్యానెల్ నుంచి ప్రధాన కార్యదర్శిగా బడిశెట్టి శ్రీనివాస్ గుప్తా, కోశాధికారిగా బడంపేట్ శ్రీనివాస్ గుప్తా విజయం సాధించారు.విజయం అనంతరం నామ రవికిరణ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ఆర్యవైశ్య సంఘం కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎన్నికల్లో పోటీ స్నేహపూర్వకంగా, న్యాయబద్ధంగా జరిగిందని, సంఘం అభివృద్ధి, ఐక్యత, సంక్షేమం కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని నామ రవికిరణ్ పేర్కొన్నారు.

## జోగిపేట ఆసుపత్రి తీరు మారేది ఎన్నడు....?

- అసలే మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం
- వైద్య విధాన పరిషత్ డైరెక్టర్ తో పాటు జిల్లా కలెక్టర్ తనిఖీలు చేసిన మార్పు రాలే
- ఉద్యోగం చేసేది ఒకరు చేస్తున్నది మరొక్కరు
- వచ్చిరాని వైద్యంతో నక్లి డాక్టర్ వైద్యం చేస్తే చనిపోతే ఎవరు బాధ్యులు....?
- దీనికి సస్పెండ్ మార్గమా....?



**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ తో పాటు రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులు ప్రతినెల పైథా ఆరోగ్య శాఖ మంత్రి నియోజకవర్గం కావడంతో తనిఖీలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఆస్పత్రిలో ఎప్పుడు 23 మంది డాక్టర్లు విధులు నిర్వహించవలసి ఉన్న అధికారుల తనిఖీల్లో ముగ్గురు లేదా ఆరు మందికి మించి మిధున నిర్వహిస్తున్న సందర్భాలు ఎక్కడ కనిపించలేదు. ఇందుకోసం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ సంబంధిత డాక్టర్లకు విధులకు ఎందుకు హాజరు కాలేదు అంటూ నోటీస్ లు జార్ చేస్తామని చెప్పారు. కొందరికి అయితే చార్జిమెమోలు ఇచ్చారు. కానీ విధులకు దుమ్ములు కొట్టిన డాక్టర్ పై ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తాజాగా గత రెండు రోజుల క్రితం ఒక డాక్టర్ బదులుగా మరో డాక్టర్ విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తించి రెగ్యులర్ డాక్టర్ ను సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో పనిచేసిన డాక్టర్ పై ఎందుకు చర్యలు తీసుకోకూడదు...? అతను వైద్యం చేయడం వల్ల చనిపోయిన వారు కూడా ఉండొచ్చు కదా... ఆలోచన వైద్య విధాన పరిషత్ అధికారులకు ఎందుకు రావడం లేదు. ఈ తతకం ఎంత కాలం నుంచి నడుస్తుంది. జోగిపేట ఏరియా ఆసుపత్రి అంటేనే విమర్శలకు అడ్రస్ గా మారింది. కొందరు బాధితులు సరైన వైద్యం చేయకపోవడంతో తమ బంధువులు చనిపోయారంటూ రోడ్ ఎక్కారు. ఆ సందర్భంలో అసలు నేను డాక్టర్లు విధులు నిర్వహించారా లేక.... వాళ్ల స్థానంలో ప్రైవేట్ డాక్టర్లు విధులు నిర్వహించారు అనేది కూడా విచార చేయలేని పరిస్థితి. మంత్రి ప్రతినిధి వహిస్తున్న జోగిపేట ఏరియా ఆసుపత్రిలో నిత్యం 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉండే విధంగా ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో మంత్రి సమీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు. అయినప్పటికీ జిల్లా వేద విధాన పరిషత్ అధికారులతో ఉన్న సంబంధాల వల్ల పై స్థాయి అధికారుల తో తమకున్న సంబంధాల వల్ల ఏం చేసుకుంటారులే అన్న ధోరణి తో విధులకు హాజరు కావడం లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. మంత్రి అయినా ప్రత్యేక తీసుకొని ఇక్కడ పనిచేస్తున్న పూర్తిస్థాయి సిబ్బందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి కొత్త వారిని నియమిస్తే కొంతైనా మారే అవకాశం ఉంటుంది. ఎందుకంటే వైద్యం అనేది ఒక వ్యాపారంగా మారిపోయింది. అందుకే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేస్తే ఆ రాత్రికి రూపాయి కూడా రాదు.... అదే 1000 2000 ప్రైవేట్ డాక్టర్లకి ఇచ్చి ఇక్కడ డాక్టర్ గా పెట్టి చికిత్స చేయిస్తే ప్రైవేట్ ఆస్పత్రిలో రెగ్యులర్ డాక్టర్లు చికిత్స చేసినట్లయితే కేసులను బట్టి ఐదు నుంచి పదివేల వరకు ఒక్క రాత్రికే వచ్చే అవకాశం ఉంటుంది. దీనికి అలవాటు పడిన జోగిపేట డాక్టర్లు జై పేట సమీపంలోని ఎమ్మెన్నార్ మెడికల్ కాలేజ్ కు సంబంధించిన ట్రైనింగ్ డాక్టర్లతో ( మెడికల్ విద్యార్థులతో) నెలవారీగా మాట్లాడుకుని వారితోనే పనిచేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా దీనిపై రాష్ట్రస్థాయి వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో ప్రక్షలన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

### ప్రత్యేక అధికారులు ఎంతమంది తనిఖీలు చేశారు తీసుకున్న చర్యలు ఏమిటి...?

చీఫ్ ఏరియా ఆసుపత్రిని ప్రత్యేకంగా రాష్ట్ర వైద్య విధాన పరిషత్ డైరెక్టర్ తో పాటు, కమిషనర్, గత జిల్లా కలెక్టర్ మూడు నెలలుగా ముగ్గురు వేరువేరుగా తనిఖీలు చేశారు. ఈ సమయంలో కూడా పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది ప్రత్యేకంగా డాక్టర్లు అందుబాటులో లేరు అనేది వారి విచారణలో తేలింది. కానీ ఎక్కడ కూడా ఇలాంటి చర్యలు తీసుకోలేదు.. కేవలం మెమోలు ఇవ్వడంతోనే సరిపెట్టారు. లక్ష రూపాయలు వేతనాలు తీసుకుంటూ పేదలకు వైద్యం చేయవలసిన డాక్టర్లు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేస్తూ ప్రజా ప్రభుత్వ జీతాలు తీసుకుంటున్న వారిని ఎందుకు వదిలిపెట్టాలి... ఎన్ని రోజులు విధులకు హాజరు కాలేదో అంత రికవరీ చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## సాగునీటి కోసం అధికారులతో ప్రతిరోజు రివ్యూ సమావేశాలు నిర్వహిస్తున్నాం

- రైతులు ఎవరు ఇబ్బంది పడొద్దు
- సాగునీటి ప్రాజెక్టుల నుండి వస్తున్న నీటిని వృథా చేయొద్దు
- రైతులు వరి వేసి ఇబ్బంది పడవద్దు
- బీమా కలువ నుండి
- శ్రీరంగాపూర్ చెరువుకు కూడా సాగునీరును విడుదల చేస్తాం
- మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా :** జూరాల ప్రాజెక్టు నుండి రైతులకు సాగునీరు అందేటందుకోసం ప్రతిరోజు హైదరాబాదు నుండి అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించడం జరుగుతుందని దానికి రైతులు ఎవ్వరు కూడా ఇబ్బంది పడవద్దని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు ఆదివారం నాడు వీపనగండ్ల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై కళ్యాణ మరియు షాది ముబారక్ చెక్కులను అందజేశారు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 27 కళ్యాణ చెక్కులు మరియు మూడు షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల నుండి వస్తున్న నీరు ఏమైతే ఉన్నదో రైతులు వృధా చేయకుండా ఆరు తడి పంటలపై దృష్టి సారించాలని వరి వేసుకొని రైతులు ఇబ్బంది పడవద్దని పంటలను ఎండబెట్టుకోవద్దని ఆయన రైతులకు సూచించారు అదేవిధంగా జూరాల నెట్టెంపాడు బీమా తదితర ప్రాజెక్టుల నుండి సాగునీరు వస్తుందని ఆయన తెలిపారు బీమా కాలువ నుండి శ్రీరంగాపూర్ చెరువుకు కూడా సాగునీరు విడుదల అవుతుందని ఆయన తెలిపారు
ఎవరైనా లంచాలు తీసుకుంటే కఠిన చర్య తప్పదు లబ్ధిదారులు ఎవరైనా కళ్యాణ చెక్కుల కోసం అధికారులకు గాని మధ్యవర్తులకు గాని లంచాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు ఇదే సందర్భంగా లబ్ధిదారులను ఎవరైనా అధికారులకు లంచాలు ఇస్తున్నారా అని అడగగా అంజనమ్మ అనే లబ్ధిదారు నేను పదివేల రూపాయలు పుల్గర్ల గ్రామంలో ఒక వ్యక్తికి ఇవ్వడం జరిగింది అని చెప్పగా మంత్రి తీవ్రస్థాయిలో మండిపడి అతనిపై కేసు పెట్టమని ఎస్సైకి తెలియజేశారు అంతేకాకుండా గ్రామ పార్టీ నాయకులు గాని కార్యకర్తలు గాని ఎవరైనా లంచాలు తీసుకుని ప్రయత్నం చేస్తే ఎంతటి వారినైనా క్షమించను అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

### రైతు, కార్మికుల హక్కుల కోసం
## 'జైల్ భరో'కు పిలుపు

- కేంద్ర విధానాలపై మండిపడ్డ రైతు, కార్మిక సంఘాల నేతలు



**రెంజల్, బోధన్ నియోజకవర్గం:** కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టనున్న 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (SKM) మండల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. బోధన్ నియోజకవర్గంలోని రెంజల్ మండల కేంద్రంలో తాడిబిలోలి గ్రామానికి చెందిన రైతు, కార్మిక సంఘాల నాయకులు సమావేశమై కార్యక్రమంపై చర్చించారు.
ఈ సందర్భంగా అఖిలభారత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పార్వతి రాజేశ్వర్, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుట్టినడిపి నాగన్న మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తూ రైతులు, కార్మికుల ప్రయోజనాలను విస్మరిస్తోందని ఆరోపించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి బలోపేతం చేయాలని, రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు C2+50 శాతం ప్రాతిపదికన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. రైతు, కార్మికుల సమస్యలపై చేపట్టనున్న దేశవ్యాప్త 'జైల్ భరో' కార్యక్రమంలో రెంజల్ మండలం నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెంజల్ మండల రైతు సంఘం అధ్యక్షుడు మిద్దె పెద్దులు, మండల కార్యదర్శి పసుల గోపాల్, మన్నె పోశెట్టి, సిద్ధ పోశెట్టి, గ్రామ అధ్యక్షుడు హమీద్, మైసయ్య, సుదర్శన్, శివాజీ, మీరే షాప్ తదితరులు పాల్గొన్నారు.

— ప్రజావాయిస్ ప్రతినిధి, రెంజల్,

## పీవీటీజీలకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలి

- ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ



**నిజామాబాద్, ప్రజావాయిస్:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా మాదాపూర్ మండలంలోని మదాపూర్ గ్రామంలో ఆదివాసీ తోటీ తెగకు చెందిన ప్రజలు సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీటీజీ వర్గాల ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. PVTG అంటే Particularly Vulnerable Tribal Groups (ప్రత్యేకంగా బలహీన గిరిజన తెగలు) అని, ఈ వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా మరింత వెనుకబడి ఉన్నందున ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం పీవీటీజీల అభివృద్ధి కోసం కేటాయిస్తున్న ప్రత్యేక నిధులు, సంక్షేమ పథకాలు అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీలకు రాజ్యాంగపరంగా కల్పించిన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పీవీటీజీల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ కేటాయించి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



# పోలీస్ అమరవీరుల త్యాగాలే నేడు నెలకొన్న శాంతికి పునాది

- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్
- పోలీస్ అమరవీరుల కుటుంబాల కోసం 'TG-VEER' ప్రత్యేక గ్రీవెన్స్ పోర్టల్‌ను ప్రారంభించిన డీజీపీ



**ప్రజా వాయిస్, హన్మకొండ జిల్లా ప్రతినిధి :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పర్యటనలో భాగంగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, నక్సలిజంపై పోరాటంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 28 మంది పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు 'TG-VEER' పేరుతో ప్రత్యేక గ్రీవెన్స్ పోర్టల్‌ను డీజీపీ ప్రారంభించారు. ఈ పోర్టల్ ద్వారా అమరవీరుల కుటుంబ సభ్యులు తమకు సంబంధించిన ఆర్థిక సహాయం, ఎక్స్‌గ్రేషియా, కారుణ్య నియామకాలు, ఇంటి స్థలాల కేటాయింపు, స్థలాల రిజిస్ట్రేషన్/టైటిల్ సమస్యలు, పెన్షన్, ఇతర సంక్షేమ పథకాలు మరియు ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రయోజనాలకు సంబంధించిన ఫిర్యాదులను ఒకే వేదిక ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది.
అమరవీరుడి ఉద్యోగ వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, ఇప్పటివరకు అందిన ప్రయోజనాలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు (గోస్ ) తదితర సమాచారాన్ని కూడా ఈ పోర్టల్‌లో సమగ్రంగా పొందుపరచనున్నారు. యూనిట్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉన్నతాధికారులు ఫిర్యాదులను పర్యవేక్షించి, వాటి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా ఈ పోర్టల్‌ను రూపొందించారు.
ఈ సందర్భంగా డీజీపీ క్యూఆర్ కోడ్‌తో కూడిన కుటుంబ కార్డులను అమరవీరుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నేరుగా TG-VEER గ్రీవెన్స్ పోర్టల్‌కు వెళ్లి తమ సమస్యలను నమోదు చేసుకోవచ్చు.
ఈ పోర్టల్‌ను రూపొందించిన ఎస్ఐబీ అధికారులు రాష్ట్రంలోని అన్ని యూనిట్లకు వెంటనే సమాచారం అందించి, ఆయా యూనిట్ల పరిధిలోని అన్ని పోలీస్ అమరవీరుల కుటుంబాల నుంచి సమస్యలు, ఫిర్యాదులను సేకరించి, వాటిపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీ ఆదేశించారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబ సభ్యులు తమకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను డీజీపీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఎక్స్‌గ్రేషియా, ఆర్థిక సహాయం, ఇంటి స్థలాల కేటాయింపు, స్థలాల రిజిస్ట్రేషన్ మరియు టైటిల్ సమస్యలు, పెన్షన్, ఇతర సంక్షేమ అంశాలకు సంబంధించిన సమస్యలను వివరించారు. కుటుంబ సభ్యులు తెలిపిన సమస్యలను డీజీపీ సావధానంగా విని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అమరవీరుల కుటుంబాలకు అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ, వారి సమస్యలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ను డీజీపీ ఆదేశించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ, తన వృత్తి జీవిత ప్రారంభ దశలో నక్సలిజం తీవ్రంగా ఉన్న సమయంలో వరంగల్‌లో విధులు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను కోల్పోయిన పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబాల బాధను తాను అర్థం చేసుకోగలనని తెలిపారు. నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులను, ఎదురుకాల్పులు, దాడులు, ఆకస్మిక దాడులు వంటి సవాళ్లను గుర్తుచేస్తూ, నేడు ఈ ప్రాంతంలో నెలకొన్న ప్రశాంత వాతావరణం, శాంతిభద్రతలకు పోలీస్ అమరవీరుల త్యాగాలే ప్రధాన పునాది అని డీజీపీ పేర్కొన్నారు. విధి నిర్వహణకు తమ ప్రాణాల కంటే ప్రాధాన్యతనిచ్చి త్యాగాలు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించిన డిజిపి నిర్మాణంలో ఉన్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ భవనం పరిశీలన అనంతరం నేర సమీక్ష సమావేశానికి వెళ్లే ముందు డీజీపీ సీవీ ఆనంద్ నిర్మాణంలో ఉన్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్న నేపథ్యంలో, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత కొనసాగుతున్న పనుల వివరాలను డీజీపీకి వివరించారు. కొత్త పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందేలా భవనం రూపకల్పన ఉండాలని డీజీపీ సూచించారు. అంతర్గత పరిపాలనా సామర్థ్యం పెంపొందించడంతో పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి, మెరుగైన నిఘా వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు.
కార్యాలయ ప్రాంగణంలో ఉపయోగంలో లేని, శిథిలావస్థకు చేరుకున్న నిర్మాణాలను తొలగించాలని, కొత్త కార్యాలయ భవనానికి వెళ్లే అంతర్గత రహదారులను మెరుగుపరచాలని డీజీపీ సూచించారు. ప్రజలకు కార్యాలయం సులభంగా కనిపించేలా, సౌకర్యవంతంగా చేరుకునేలా మెరుగైన ప్రాప్యత, స్పష్టమైన దృశ్యమానత ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐ జీ ఇంటెలిజెన్స్ కార్తికేయ, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఎస్పీ సింధు శర్మ, అడిషనల్ కలెక్టర్ రవి, అడిషనల్ ఎస్పీ లు వినోద్, శ్యాం బాబు పాల్గొన్నారు.

# పొలం వద్ద దంపతులపై దాడి.. తీవ్ర గాయాలు

- కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసినట్లు ఫిర్యాదు
- భూవివాదమే కారణమని బాధితురాలి ఆరోపణ
- తమకు, కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆందోళన
- నిందితులపై చర్యలు తీసుకోవాలని వాజేడు పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
- ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని వేడుకోలు



**ప్రజా వాయిస్,వాజేడు:** భూవివాదం నేపథ్యంలో పొలం వద్ద తన భర్తపై కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని చేరుకూరు గ్రామానికి చెందిన లొట్టిపిట్టల స్వాతి వాజేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ నెల 6న వాజేడు ఎస్‌హెచ్‌ఓకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఈ నెల 5న ఉదయం సుమారు 11 గంటల సమయంలో స్వాతి తన భర్త శ్రవణ్‌కుమార్‌తో కలిసి పొలం పనులు చేస్తుండగా, భూవివాదాలకు సంబంధించి లొట్టిపిట్టల శివశంకర్, హరిబాబు, ఈశ్వరమ్మ తదితరులు అక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు. శివశంకర్ కట్టెతో తన భర్త శ్రవణ్‌కుమార్ తలపై కొట్టడంతో తీవ్ర రక్తగాయం అయినట్లు, హరిబాబు ఇనుప రాడ్‌తో కుడి చేయి, వెన్ను, కుడి వైపు కిడ్నీ ప్రాంతంలో దాడి చేసినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. తనపై కూడా దాడి చేసి కుడి చేతికి గాయపరిచారని స్వాతి పేర్కొన్నారు. దాడి సమయంలో ఈశ్వరమ్మ తమను పట్టుకుని ఉండగా, శివశంకర్, హరిబాబులు కర్రలు, రాడ్లతో దాడి చేసినట్లు ఆరోపించారు. ఈ ఘటన అనంతరం శివశంకర్, హరిబాబు, లక్ష్మణ్ నుంచి తమకు, తమ కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, చంపుతామని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు రక్షణ కల్పించడంతో పాటు, ఘటనపై దర్యాప్తు చేసి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వాజేడు పోలీసులను స్వాతి కోరారు.

## పాల్వంచ మండలంలో నూతన పింఛన్ల దరఖాస్తుల ఆహ్వానం

- 36 పంచాయతీల్లో కొత్త పింఛన్ల స్వీకరణ.. స్పష్టం చేసిన పాల్వంచ ఎంపీడీఓ



**ప్రజా వాయిస్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల వ్యాప్తంగా ఉన్న 36 గ్రామ పంచాయతీల పరిధిలోని అర్హులైన లబ్ధిదారుల నుండి వివిధ రకాల పింఛన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాల్వంచ ఎంపీడీఓ పి. రాజారావు తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు మరియు ఫైలేరియా వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.
పింఛను పొందేందుకు దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1,50,000 లోపు ఉండాలని మరియు మెరక భూమి 1.5 ఎకరాలకు మించకూడదని ఎంపీడీఓ స్పష్టం చేశారు. కేటగిరీల వారీగా చూస్తే.. వితంతువులు, ఒంటరి మహిళలకు 18 ఏళ్లు నిండి ఉండటంతో పాటు భర్త మరణ లేదా విడాకుల పత్రాల అవసరం. దివ్యాంగులకు వయస్సుతో సంబంధం లేకుండా 40 శాతం వైకల్యం (వినికిడి లోపం ఉంటే 50 శాతం) ఉండాలి. ఇక 50 ఏళ్లు నిండిన గీత, నేత కార్మికులు సంబంధిత సొసైటీ లేదా హ్యాండ్లూమ్ డిపార్ట్‌మెంట్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
అర్హత కలిగిన అభ్యర్థులు తమ పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి దరఖాస్తులు అందజేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ద్వారా మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ చేసిన అనంతరం, అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయ్యాక అర్హులకు పింఛన్లు మంజూరు చేయబడతాయి. ప్రస్తుతం వృద్ధాప్య పింఛన్ల మంజూరు నిలిపివేయబడిందని, మిగతా కేటగిరీల అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

# యువతే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది

- రాజీవ్ చౌక్‌లో ఘనంగా జెండా ఆవిష్కరణ
- ప్రజాస్వామ్య విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- యువతకు విద్య, ఉపాధి, నైపుణ్య అవకాశాలు పెంచాలి
- ప్రజా సమస్యలపై ఐకమత్యంగా పోరాడాలి.
- యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజా వాయిస్,మిర్యాలగూడ. :** యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. మిర్యాలగూడ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (BLR) హాజరై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటేష్, యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే BLR మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్మించడంలో యువత పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాస్వామ్య విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. యువతకు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవా రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఐకమత్యంతో ప్రజా సమస్యలపై పోరాడుతూ యువత, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ హాజరుద్దీన్, కాంగ్రెస్ నాయకులు చిలుకూరి బాలకృష్ణ, నూకల వేణుగోపాల్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు మోయిజ్, కోడిరెక్క ఇంద్రకుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### దోమకొండలో అంగరంగ వైభవంగా
## దుర్గమ్మ బోనాలు

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ.



**ప్రజా వాయిస్, దోమకొండ :** దోమకొండ మండల కేంద్రంలోని దుర్గమ్మ ఆలయంలో ఆషాఢ మాసం రెండో ఆదివారం సందర్భంగా దుర్గమ్మ బోనాల పండుగను భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. పెరిక, ముదిరాజ్, రెడ్డి, పద్మశాలి తదితర సంఘాల సభ్యులతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలను సమర్పించారు. మేళతాళాలు, కోలాటాల నడుమ బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి దుర్గమ్మ అమ్మవారికి సమర్పించారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.
విద్యుత్ దీపాలతో ఆలయ అలంకరణ బోనాల పండుగను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.
ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువతతో పాటు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి నామస్మరణతో దోమకొండలో పండుగ వాతావరణం నెలకొంది.


# యూరియా యాపులతో సతమతమవుతున్న రైతులు

- యాప్ పై అవగాహన లేక సరైన సమయంలో అందని యూరియా
- దిక్కుతోచని స్థితిలో ఫర్టిలైజర్ షాప్ ముందు యాప్ కోసం రైతుల నిరీక్షణ




**దుబ్బాక ప్రజా వాయిస్ :** సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం లో యూరియా కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొన్నటి వరకు ఉన్న యూరియా యాప్ ఒకసారి తొలగించడంతో మరో కొత్త యాప్ వాడుకోవాలని వ్యవసాయ శాఖ సూచించడంతో రైతులకు తప్పని తిప్పలు కొత్తగా వచ్చిన యాప్ ఎవరికి కూడా అర్థం కాని రీతిలో ఉండడంతో ఫర్టిలైజర్ షాపులకు సంబంధించిన వ్యక్తులు మాత్రమే యాప్ ఉపయోగించుకొని కొంత మందికి మాత్రమే యూరియా దొరకడంతో మిగతా రైతులు యూరియా ఎలా తీసుకోవాలో తెలియని స్థితిలో ఫర్టిలైజర్ షాపుల వద్ద దిక్కుతోచని పరిస్థితులలో యూరియా ఎలా అని షాప్ యజమానులను అడిగిన యాప్ లో మాత్రమే యూరియా దొరుకుతుందని చెప్తున్నారు అవగాహన లేని రైతులు యూరియాను ఎలా ఆన్లైన్లో బుక్ చేసుకోవాలో తెలియక యూరియా ను అధిక రేట్లకు కొంటున్నట్లు సమాచారం. యాప్ లో లేని యూరియాను బ్లాక్ లో ఎలా దొరుకుతుంది దీని వెనకాల ఎవరి హస్తం ఉంది. కొత్తగా వచ్చిన యాప్ పై వ్యవసాయ శాఖ అధికారులు సరైన అవగాహన రైతులకు కల్పించకపోవడం వలన రైతులు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారు. యాప్ ఓపెన్ చేస్తే ఎన్నో రకాల పర్మిషన్లు అడగడంతో కొంతమంది భయంతో ఫర్టిలైజర్ యాప్ వినియోగించడం లేదు దీంతో మొక్కజొన్నకు వేయాల్సిన యూరియా సరైన సమయంలో వెయ్యలేక చేతికొచ్చిన పంటలు వాడిపోతున్నాయి. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు కొత్తగా వచ్చిన యాప్ ను రైతులకు సరైన విధంలో అవగాహన కల్పించి యూరియాను పక్కదారి పట్టించకుండా రైతులకు అందేటట్లు చూడాలని రైతులు కోరుతున్నారు.



## ఘనంగా యూత్ కాంగ్రెస్ వేడుకలు

- యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జండా ఆవిష్కరణ చేసిన మండల అధ్యక్షులు శివ గౌడ్



**ప్రజావాయిస్/తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కేంద్రంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంద్రకంటి శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలో బస్ స్టాప్ ఆవరణలో ఆదివారం యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా యువజన కాంగ్రెస్ జెండా ఆవిష్కరించిన మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంద్రకంటి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ,, కాంగ్రెస్ పార్టీలో యువజన కాంగ్రెస్ విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం పోరాడుతూ వారికి జరిగే వరకు పోరాడు తామని యువజన కాంగ్రెస్ విద్యార్థులకు అండగా ఉంటుంద ని తెలిపారు.అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డేవిడ్, మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేందర్, గణేష్,గట్టుప్పలపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రకాష్ గౌడ్ నవీన్ గౌడ్ రాంపూర్ గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ శివ సురేష్ గణేష్ పురుషోత్తం సుధాషన్ సురేష్ ఆంజనేయులు కుమార్ జగదీష్ మహేష్ సాయి తేజ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

- ఢిల్లీ పోరాటమే యూత్ కాంగ్రెస్ సత్తాకు నిదర్శనం:
- రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి అంజనీ
- ప్రజా సమస్యలపై పోరాటంలో యువత ముందుండాలి: జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు
- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన విభాగమే వెన్నుముక: నాయకులు



**ప్రజా వాయిస్ ఖమ్మం:** ఖమ్మం జిల్లా, పాలేరు నియోజకవర్గం, నేలకొండపల్లి మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు సెంటర్ వద్ద యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నెపూసల సీతారాములు హాజరై జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన విభాగం వెన్నుముకలా పనిచేస్తోందని తెలిపారు. దేశానికి, రాష్ట్రానికి యువతే ఆధారమని, ప్రజా సమస్యలపై పోరాటంలోనూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో యువతరం బాధ్యతాయుతంగా పనిచేస్తూ సమాజ మార్పునకు శ్రీకారం చుట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, బి బ్లాక్ అధ్యక్షులు జెర్రీపోతుల సత్యనారాయణ, నేలకొండపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడవల్లి నాగరాజు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగూరి వాసవి, సర్పంచ్ బోయిన వేణు, దోసపాటి శేఖర్, వంగవీటి నాగేశ్వరరావు, మైసా శంకర్, రెడ్డిమళ్ళ బాబు రెడ్డి, నల్లాని మల్లిఖార్జున్ రావు, పసుపులేటి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించండి

**వరంగల్ ఎంపీ కడియం కావ్యకు రిటైర్డ్ ఉద్యోగుల వినతి**



**ప్రజా వాయిస్/ తొర్రూరు(మహబూబాద్ జిల్లా) :** తొర్రూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తొర్రూరు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధి బృందం ఆదివారం వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ను కలిసి వినతిపత్రం అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం తొర్రూరు మండల శాఖ అధ్యక్షుడు ఇట్టే సోమారెడ్డి నేతృత్వంలో అసోసియేట్ ప్రెసిడెంట్ మన్నూరు కోటయ్య, దీకొండ వీరభద్రం, ఆర్థిక కార్యదర్శి బోడ బాలాజీ, గట్టు సోమయ్య తదితరుల ప్రతినిధి బృందం వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్యను ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకం కలిసి తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో రిటైర్డ్ ఉద్యోగుల సౌకర్యం కోసం వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా సబ్ ట్రెజరీ ఆఫీస్, అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు ఈ వినతిపత్రంలో ఎంపీ ని కోరారు. అలాగే తొర్రూరు డివిజన్ కేంద్రంలో నిర్మించిన తమ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనం అభివృద్ధి పనుల కోసం కూడా సహకరించాలని వారు ఎంపీ కడియం కావ్యను అభ్యర్థించారు.

## ఆర్యవైశ్య కుటుంబాల సర్వే చేపట్టాలి

- సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి


**ప్రజా వాయిస్ తొర్రూర్ :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొద్దుటూరి గౌరీ శంకర్ ఆర్యవైశ్యమహాసభ
మహబూబాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం తొరూరు డివిజన్ కేంద్రంలోని రామా ఉపేందర్ గార్డెన్లో జిల్లా అధ్యక్షుడు తల్లాడ వెంకట రామారావు అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశానికి పొద్దుటూరి గౌరీ శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లాలోని 18 మండలాల్లో ఆర్యవైశ్య కులస్తుల సమగ్ర కుటుంబ సర్వేను సంబంధిత మండల బాధ్యులు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ఇందుకు సంబంధించిన సర్వే పత్రాలను సంబంధిత మండల బాధ్యులకు అందజేశారు. 18 సంవత్సరాలు నిండిన ఆర్యవైశ్య యువతి యువకులకు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ శాశ్వత సభ్యత్వలను నమోదు చేయించాలని తెలిపారు. మండలాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేసి ఎన్నికలు పూర్తి చేయాలని ఆదేశించారు. సభ్యత నమోదుకు ప్రత్యేక కమిటీని నియమించడం జరిగిందని మండలంలో పనిచేసే కార్యవర్గం సభ్యత నమోదు కమిటీ చైర్మన్ మాలే యోగేశ్వరరావుకు వివరాలు అందజేయాలని సూచించారు. సంఘ బలోపేతం కోసం కృషి చేస్తూ సభ్యత్వ నమోదును పూర్తి చేసి కమిటీల నియామకాన్ని వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఆర్యవైశ్య కులస్తుల సంఖ్యను తేల్చే క్రమంలో మనం చేపట్టే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను నిరుపేదలకు వర్తింపజేసేందుకు దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం పేద ఆర్యవైశ్య కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అరులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలని, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, ఇతర పథకాలను అందించాలని కోరారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో సర్పంచులుగా, కౌన్సిలర్లుగా గెలుపొందిన ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులు,వి రాష్ట్ర మహాసభలో పదవులు పొందిన వారిని శాలువా, మెమొంటోలతో సత్కరించారు. జిల్లా కార్యవర్గ సమావేశానికి వసతి, భోజన సౌకర్యం కల్పించిన దాతలు రామ ఉపేందర్ ను సత్కరించారు.






# బంగారు శివలింగం.. భక్తి భావాల సంగమం

- యాదాద్రి సమీపంలో ఆధ్యాత్మిక అద్భుతం.. రమణేశ్వరం గోల్డెన్ శివలింగం ఆలయానికి పెరుగుతున్న భక్తుల తాకిడి
- మూడు అడుగుల సువర్ణ శివలింగం ప్రధాన ఆకర్షణ.. దర్శనానికి తరలివస్తున్న శివభక్తులు
- ఒకే ప్రాంగణంలో వెయ్యి శివలింగాల వైభవం.. భక్తులకు దివ్య అనుభూతి
- శివశక్తి అనుగ్రహ మహాపీఠంగా గుర్తింపు.. ధ్యానం, ఆధ్యాత్మిక సాధనకు అనువైన క్షేత్రం
- యాదాద్రి యాత్రలో మరో ఆధ్యాత్మిక గమ్యం.. నాగిరెడ్డిపల్లి సమీపంలో వెలసిన పవిత్ర ఆలయం


**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణ ఆధ్యాత్మిక పర్యాటక పటంలో మరో అద్భుత క్షేత్రం ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటోంది. యాదాద్రి భువనగిరి జిల్లా నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న రమణేశ్వరం గోల్డెన్ శివలింగం ఆలయం భక్తులను ఆకర్షిస్తోంది. యాదగిరి గుట్ట నుంచి సుమారు 27,30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయం ప్రశాంతమైన వాతావరణంలో ఆధ్యాత్మిక అనుభూతిని పంచుతోంది.

**బంగారు కాంతులతో వెలుగొందుతున్న పరమశివుడు**

మూడు అడుగుల సువర్ణ శివలింగం ఆలయానికి ప్రధాన ఆకర్షణ రమణేశ్వరం ఆలయంలో ప్రతిష్టించిన మూడు అడుగుల సువర్ణ శివలింగం భక్తులను మంత్ర ముగ్ధులను చేస్తోంది. బంగారు కాంతులతో మెరిసిపోయే ఈ శివలింగ దర్శనం భక్తులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తోంది. అరుదైన ఈ శివలింగాన్ని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు.శివుని సన్నిధిలో కొద్దిసేపు గడిపితే మనసుకు ప్రశాంతత లభిస్తుందని భక్తులు విశ్వసిస్తున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

**వెయ్యి శివలింగాల వైభవం**

ఒకే ప్రాంగణంలో శివనామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం ఈ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 1000 శివలింగాలు మరో విశిష్టత. ఒకే ప్రదేశంలో ఇన్ని శివలింగాలను దర్శించుకోవడం భక్తులకు అరుదైన అవకాశం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంటుంది.ప్రతి శివలింగం వద్ద భక్తులు పూజలు నిర్వహిస్తూ భక్తి పరవశంలో మునిగి పోతున్నారు. కుటుంబ సమేతంగా వచ్చి శివుని ఆశీస్సులు పొందుతున్నారు.

**శివశక్తి అనుగ్రహ మహాపీఠంగా గుర్తింపు**

భక్తుల నమ్మకాలకు నిలయంగా మారిన పవిత్ర క్షేత్రం ఈ క్షేత్రాన్ని శివశక్తి షిర్డీ సాయి అనుగ్రహ మహాపీఠంగా కూడా పిలుస్తారు. శివారాధనతో పాటు ఆధ్యాత్మిక సాధనకు ఈ ప్రాంతం అనువైన ప్రదేశంగా భక్తులు భావిస్తున్నారు.పుట్టినరోజులు, ప్రత్యేక సందర్భాలు, శుభ కార్యాల సందర్భంగా అనేక మంది భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

**ప్రశాంత వాతావరణం.. మనశ్శాంతికి చిరునామా**

ధ్యానం, ఆధ్యాత్మిక సాధనకు అనుకూలంగా ఆలయ నిర్మాణం విశాలమైన విస్తీర్ణంలో నిర్మించిన ఆలయ సముదాయం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. చుట్టూ ప్రశాంత వాతావరణం ఉండటంతో ధ్యానం చేసేందుకు, ఆధ్యాత్మిక చింతనకు ఈ క్షేత్రం అనువుగా ఉంటుంది. నగర జీవనంలోని ఒత్తిళ్ల నుంచి కొంత సమయం దూరంగా ఉండి ప్రశాంతతను పొందేందుకు భక్తులు ఈ ప్రాంతాన్ని ఎంచుకుంటున్నారు.

**యాదాద్రి యాత్రలో మరో మధుర అనుభూతి**

నరసింహుడి దర్శనంతో పాటు శివుని సన్నిధి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులు సమీపంలోని రమణేశ్వరం గోల్డెన్ శివలింగం ఆలయాన్ని కూడా సందర్శిస్తున్నారు. దీంతో యాదాద్రి ఆధ్యాత్మిక యాత్రలో ఈ క్షేత్రం మరో ముఖ్యమైన ఆకర్షణగా మారుతోంది.భక్తి, ప్రశాంతత, ఆధ్యాత్మిక వైభవం కలగలిపిన ఈ ఆలయం భక్తులకు మరపురాని అనుభూతిని అందిస్తోంది.

**భక్తుల సందడి..**
**ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త గమ్యం**

ప్రత్యేక నిర్మాణ శైలి, సువర్ణ శివలింగం, వెయ్యి శివలింగాల దర్శనం, ఆధ్యాత్మిక వాతావరణంతో రమణేశ్వరం గోల్డెన్ శివలింగం ఆలయం రోజురోజుకు ప్రాచుర్యం పొందుతోంది.బంగారు శివలింగ దర్శనం వెయ్యి శివలింగాల వైభవం శివుని సన్నిధిలో ప్రశాంతత ఇదే రమణేశ్వరం గోల్డెన్ శివలింగం ఆలయ ప్రత్యేకత.

## ఆదివాసీ సంస్కృతిని కాపాడుకోవాలి

- ప్రభుత్వ (ఎస్టీ) గిరిజన కాలేజ్ హాస్టల్లో ఘనంగా ఆదివాసీ దినోత్సవం
- పాల్గొన్న ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోటియా నాయక్, రాజు నాయక్




**ప్రజా వాయిస్, కోదాడ:** ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోటియా నాయక్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ (ఎస్టీ) గిరిజన కాలేజ్ హాస్టల్లో హాస్టల్ వార్డెన్ పద్మ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కోటియా నాయక్ మాట్లాడుతూ.. ఆదివాసీ సమాజం తమ ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను తరతరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. విద్యార్థులు విద్యతోపాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు రాజు నాయక్ మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధికి విద్యే ప్రధాన ఆయుధమని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. గిరిజనుల హక్కుల సాధనలో ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గోపి రాథోడ్, నిఖిల్ నాయక్, ధరావత్ వెంకటేశ్వర్లు, హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సై రమేష్ గౌడ్‌ను సన్మానించిన ప్రెస్ క్లబ్ సభ్యులు



**ప్రజా వాయిస్, ఎల్లారెడ్డిపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల నూతన ఎస్సైగా శనివారం బాధ్యతలు స్వీకరించిన రమేష్ గౌడ్‌ను ఆదివారం టీయూడబ్ల్యూజే అనుబంధ ప్రెస్ క్లబ్ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ గౌడ్ మాట్లాడుతూ... మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులు ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని, ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పంజ సంపత్ కుమార్, పోతుల గాంధీబాబు, రెడ్డిమల్ల సత్యనారాయణ, ఏర్పుల నారాయణ, జనగామ రమేష్, మారేపు భూశంకర్, పుల్లూరి సత్యనారాయణ, తిరుపతి, ముద్రకోల కృష్ణ, రెడ్డిమల్ల నరసయ్య, పండుగ బాబు తదితర సభ్యులు పాల్గొన్నారు.

## పేదల కళ్లలో ఆనందమే ఎమ్మెల్యే పద్మావతి లక్ష్యం

- డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీపై పాలాభిషేకం.. మంత్రి ఉత్తమ్, పద్మావతి రెడ్డికి కృతజ్ఞతలు
- నల్లగొండ జిల్లా మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాయపూడి వెంకట్‌నారాయణ



**ప్రజా వాయిస్,కోదాడ:** పేద ప్రజల కళ్లలో ఆనందం చూడటమే కోదాడ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు పద్మావతి రెడ్డి జీవితాశయమని ఉమ్మడి నల్లగొండ జిల్లా మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాయపూడి వెంకట్‌నారాయణ అన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ చేపట్టిన సందర్భంగా ఆదివారం చిత్తు పేపర్లు ఏరుకుంటూ, యాచక వృత్తితో జీవనం సాగిస్తున్న మహిళలతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతి రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా రాయపూడి వెంకట్‌నారాయణ మాట్లాడుతూ.. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న పద్మావతి రెడ్డికి పట్టణ ప్రజలు, నియోజకవర్గ ప్రజలు అండగా నిలవాలని కోరారు. పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ చేపట్టడం అభినందనీయమన్నారు.ఈ నెల 15న పద్మావతి రెడ్డి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పేదలు, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం అభినందనీయమన్నారు.తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై పడకుండా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాగార్జునసాగర్‌లో మహా వరుణయాగం నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండా

- అవినీతి, అక్రమాలపై పోరుబాట
- బీజేపీ రాష్ట్ర నాయకులు వేరబెల్లి రఘునథ్ రావు



**ప్రజా వాయిస్, లక్షెట్టిపేట./ మంచిర్యాల :** తెలంగాణలో బీజేపీ గెలుపే లక్ష్యంగా, ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా, అవినీతి, అక్రమాలపై పోరాడుతామని బీజేపీ రాష్ట్ర నాయకులు వేరబెల్లి రఘునాథ్ రావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన లక్షెట్ పేట పట్టణంలో 'ప్రజా వాయిస్ తో మాట్లాడారు. 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గాన్ని బీజేపీ గెలవబోతుందన్నారు. రైతులు, మహిళలు, అన్ని వర్గాల పట్ల బీజేపీ పోరాడిందన్నారు. ప్రజలు మార్పు కోరుకున్నారని, కాంగ్రెస్ కు తామే ప్రత్యామ్నాయ మన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూస్తామన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వాలి

- టీజేఏ సిద్దిపేట జిల్లా సమావేశంలో కీలక తీర్మానాలు



**ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా :** జర్నలిస్టుల సంక్షేమం మరియు హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) సిద్దిపేట జిల్లా సమావేశం స్పష్టం చేసింది. సిద్దిపేట పట్టణంలోని వైశ్య భవన్‌లో ఎన్‌యూజే ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు ఉక్కలకర రాజేందర్‌నాథ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి టీజేఏ ఫౌండర్ ఉప్పల లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్‌యూజే ఇండియా కార్యవర్గ సభ్యులు డి. రాజలింగం, టీజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్. గౌరీ, ఉపాధ్యక్షులు చింత నీలకంఠం, సీనియర్ సభ్యులు కే. సత్యనారాయణ తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. జర్నలిస్టులు సమాజానికి సమాచారాన్ని అందిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారని, అలాంటి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో టీజేఏను మరింత బలోపేతం చేసేందుకు జిల్లా కమిటీని పునర్వ్యవస్థీకరించాలని, జర్నలిస్టులను సంఘటితం చేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిశ్చయించారు. ముఖ్యంగా అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా జర్నలిజంలో ఉంటూ సొంత ఇల్లు లేని వారిని గుర్తించి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంబంధిత స్థాయిలో సమన్వయం పెరిగేలా రాష్ట్ర మరియు జిల్లా స్థాయి హైపవర్ కమిటీలను వెంటనే పునరుద్ధరించాలని తీర్మానించారు. వైద్య అవసరాల నిమిత్తం జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ఈ కార్డుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, దశాబ్దాల తరబడి సేవలు అందించిన 75 ఏళ్లకు పైబడిన వృద్ధ జర్నలిస్టులకు ఉచిత బస్సు పాస్ సౌకర్యాన్ని కల్పించి చేయూతనివ్వాలని మరో కీలక తీర్మానం చేశారు. జర్నలిస్టుల ఐక్యతే వారి బలమని, అందరూ కలిసికట్టుగా ఉండి హక్కుల సాధనకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ తీర్మానాలన్నింటినీ ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన అమలు చేయాలని, సిద్దిపేట జిల్లా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతామని ప్రతినిధులు స్పష్టం చేశారు.

## అంగరంగ వైభవంగా దుర్గమ్మ బోనాలు

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ.

**ప్రజా వాయిస్ దోమకొండ :** ఆగస్టు 9 దోమకొండ మండల కేంద్రంలోని దుర్గమ్మ ఆలయంలో ఆషాఢ మాసం రెండో ఆదివారం సందర్భంగా దుర్గమ్మ బోనాల పండుగను భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.పెరిక, ముదిరాజ్, రెడ్డి, పద్మశాలి తదితర సంఘాల సభ్యులతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలను సమర్పించారు. మేళ తాళాలు, కోలాటాల నడుమ బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి దుర్గమ్మ అమ్మవారికి సమర్పించారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.విద్యుత్ దీపాలతో ఆలయ అలంకరణ బోనాల పండుగను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

## కాంక్రీట్ మిక్సర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి

- ప్రమాద స్థలంలో ఆగిన మంత్రి జూపల్లి



**ప్రజా వాయిస్, వనపర్తి జిల్లా :** వనపర్తి జిల్లాపానగల్ మండలం దావాచిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కాంక్రీట్ మిక్సర్ వాహనం, బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అదే మార్గంలో వెళ్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రమాదాన్ని గమనించి తన వాహనాన్ని ఆపారు. ప్రమాదం జరిగిన తీరును, కారణాలను అక్కడున్న వారిని అడిగి తెలుసుకున్నారు.
రోడ్లపై అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు రహదారి భద్రతపై వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## ఘనంగా దోమకొండ దుర్గమ్మకు బోనాలు

- వందలదిగా మహిళలు దుర్గమ్మ బోనాల సమర్పణ
- ముగిసిన ఆషాడ మాసం బోనాల పండుగ
- పలు గ్రామాల్లో గ్రామ దేవతలకు బోనాల సమర్పించిన దోమకొండ పరిసర గ్రామాల మహిళలు



**ప్రజా వాయిస్ దోమకొండ :** దోమకొండ మండల కేంద్రంలో ఘనంగా గ్రామ దేవత దుర్గమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. ముదిరాజ్, మున్నూరు కాపు,పద్మశాలీలు, పెరిక సంఘలు, ఇతర వర్గాలు చెందిన మహిళలు పెద్ద ఎత్తున వందలాదిగా మండల కేంద్రంలోని దుర్గమ్మ ఆలయానికి బోనాలు సమర్పించారు. ఆషాడ మాసంలోని చివరి ఆదివారం దోమకొండలో దుర్గమ్మకు పెద్ద ఎత్తున మహిళలు బోనాలు సమర్పించి
మొక్కులు తీర్చుకుంటారు నైవేద్యాలు సమర్పిస్తారు ఇంటింటా పండుగ జరుపుకొని ఆషాడ మాసం చివరి ఆదివారం బోనాల పండుగను నిర్వహిస్తారు. మహిళలు కొట్టవా కొత్త వస్త్రాలు ధరించి బంగారు నగలు ధరించి బోనాలను తయారుచేసి ఘనంగా పండుగ నిర్వహిస్తారు. మండల కేంద్రంలో ప్రతి ఇంటిలో బోనాల పండుగ ఉత్సవం సంతోషంగా నిర్వహిస్తారు. డప్పు వాయిద్యాలతో బోనాల ర్యాలీలు నిర్వహించి దుర్గమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. మండల కేంద్రంలో ప్రతి ఇంట బోనాల పండుగ ఉత్సవం కనిపిస్తుంది. బంధుమిత్రులను పిలుచుకొని ఆషాడ మాసం చివరి బోనాల పండుగ ఉత్సాహంగా నిర్వహించుకున్నారు.

## సెంటినరీ కాలనీలో ఘనంగా 'ఆషాఢమాసం గోరింటాకు వేడుకలు'

- ఆషాఢమాసం గోరింటాకు.. మన తెలుగు సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక
- సంప్రదాయ పరిరక్షణతో పాటు మహిళా సాధికారతే లక్ష్యం – ఫ్యామిలీ అండ్ ఉమెన్ యాక్టివిటీ చైర్మన్ లయన్ మద్రి శరణ్య
- ఉత్సాహంగా పాల్గొన్న సింగరేణి మహిళా ఉద్యోగులు, క్లబ్ సభ్యులు



**ప్రజా వాయిస్, రామగిరి :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లోని లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఫ్యామిలీ & ఉమెన్ యాక్టివిటీ చైర్మన్ లయన్ మద్రి శరణ్య ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢమాసం గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక శరణ్య నివాసంలో జరిగిన ఈ వేడుకలో సింగరేణి మహిళా ఉద్యోగులు, క్లబ్ సభ్యులు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని గోరింటాకు పెట్టుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా లయన్ మద్రి శరణ్య మాట్లాడుతూ, ఆషాఢ మాస గోరింటాకు వేడుక తెలుగు సంస్కృతికి ప్రతీక అని, మన సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మహిళల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ సాధికారతకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు డా. శరణ్య మారుతి యాదవ్, చైర్‌పర్సన్ పట్నం వసుంధర, మాచర్ల అనూష, మానస తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీ బలం

- బాధిత కుటుంబాలకు 16 వేల ఆర్థిక సహాయం

**ప్రజా వాయిస్ వేములపల్లి;** కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి బలంబలగమనివేముల పల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షు డు నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి అన్నారు.మండలం లోని మొల్కపట్నం గ్రామా నికి చెందిన రేముడాల వెంకటేష్ బైక్ ప్రమాదానికి గురై కాలు విరిగి తీవ్ర గాయాలతో మిర్యాలగూడ లోని శంకర్ నాయక్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు.ఆయనను నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి పరామర్శించారు.
ఈ సందర్భంగాకరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ "పార్టీ అంటే కార్యకర్తలే. కష్టంలో ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా నిలవడం మన బాధ్యత. బీఆర్ఎస్ అంటేనే మానవత్వం,సేవ" అని పేర్కొన్నారు.ఎన్ఎస్ బి ఆర్,ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెంకటేష్ కుటుంబానికి 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.అదేవిధంగామొల్కపట్నంగ్రామానికి రేముడాల మారెమ్మ మృతి చెందిన నేపథ్యంలో ఆమె కుటుంబాన్ని కరుణాకర్ రెడ్డిపరామ ర్శించి, ఆర్థిక భరోసాగా ఎన్ ఎస్ బిఆర్ ఫౌండేషన్ ద్వారా 6,000 రూపాయలు అందజేశారు. గ్రామం లో "ఏ కుటుంబానికి ఏలాంటి కష్టం వచ్చినా పార్టీ తరపున అండగా ఉంటాం"★ అని భరోసా ఇచ్చారు.ఈ కార్య క్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు ఈట శ్రీను,జేరిపోతుల రాజు, రేముడాల ప్రవీణ్, రేముడాల శ్రీను, పల్లె శంకర్, మోసాల శ్రీకాంత్, ఈట నాగరాజు, తరి అరవిందు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌తో నా పోలీసు ప్రస్థానం ప్రారంభమైంది..

- మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసింగ్‌లోనూ మార్పులు అవసరం
- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్
- సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, రహదారి భద్రత ప్రధాన సవాళ్లు
- ప్రాథమిక పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి
- చిన్నారులను మాదకద్రవ్యాలకు బానిసలుగా మార్చే ప్రయత్నాలను అడ్డుకోవాలి



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిది :** వరంగల్‌తో తనకున్న అనుబంధాన్ని, తన పోలీసు ప్రస్థానంలోని ముఖ్యమైన ఘట్టాలను తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ గుర్తుచేసుకున్నారు. తన ఐపీఎస్ ప్రస్థానం వరంగల్‌లోనే ప్రారంభమైందని, ఇక్కడ జిల్లా శిక్షణ పొందడంతో పాటు వరంగల్ రూరల్ ఎస్పీగా కూడా పనిచేశానని ఆయన తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పనితీరుపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్ ), వరంగల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డీజీపీ పాల్గొని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత వరంగల్ కమిషనరేట్ పరిధిలో పోలీసింగ్ పనితీరు, నేరాల పరిస్థితి, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, మహిళల భద్రత, ఆర్థిక నేరాల ధోరణులు తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీజీపీకి వివరించగా,తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీస్బ ), టి-స్పార్క్ , క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (CID)కు చెందిన ప్రాంతీయ అధికారులు సైబర్ నేరాల తాజా పరిస్థితులు, నూతన సైబర్ ముప్పులు, దర్యాప్తు విధానాలు, నేరాల నియంత్రణ, గుర్తింపు కోసం అమలు చేస్తున్న సాంకేతిక వ్యవస్థలపై డీజీపీకి వివరించారు. అనంతరం వరంగల్ ప్రాంతం ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదం ప్రభావంతో తీవ్రంగా అల్లకల్లోలంగా ఉన్న రోజులను డీజీపీ సీవీ ఆనంద్ గుర్తుచేసుకుంటూ. ఆ సమయంలో పోలీసులు నిరంతరం ప్రాణహాని మధ్య విధులు నిర్వర్తించారని తెలిపారు.
ల్యాండ్‌మైన్ పేలుళ్లు, ఆకస్మిక దాడులు, పోలీస్ స్టేషన్లు, పోలీసు అధికారులపై దాడులు వంటి తీవ్ర ముప్పులను ఎదుర్కొంటూ పోలీసులు విధులు నిర్వహించారని అన్నారు. విధులకు ఇంటి నుంచి బయలుదేరిన పోలీసులు తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుకుంటామో లేదో తెలియని పరిస్థితులు అప్పట్లో ఉండేవని, ఆ రోజులు తనకు ఎప్పటికీ మరువలేనివని డీజీపీ పేర్కొన్నారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు చేపట్టిన విస్తృత కూంబింగ్ ఆపరేషన్లను ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో 2010 నాటికి వామపక్ష తీవ్రవాదం గణనీయంగా తగ్గుముఖం పట్టిందని తెలిపారు. తీవ్రవాద కార్యకలాపాలను వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చిన వారికి ప్రభుత్వం ఆరోగ్య కార్డులు, సంక్షేమ పథకాలతో పాటు పలు పునరావాస చర్యలు అందిస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ప్రశాంత వాతావరణం, ప్రజల భద్రత, శాంతిభద్రతలు పోలీసు అమరవీరుల దశాబ్దాల త్యాగాల ఫలితమేనని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త పోలీసింగ్ సవాళ్లు గత మూడు దశాబ్దాలతో పోలిస్తే ప్రస్తుతం పోలీసింగ్ స్వరూపం గణనీయంగా మారిందని డీజీపీ తెలిపారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదం ప్రధాన భద్రతా సవాలుగా ఉండగా, ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆర్థిక నేరాలు, రహదారి భద్రత వంటి అంశాలు ప్రధాన సవాళ్లుగా మారాయని అన్నారు. ఈ నూతన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక విభాగాలు, సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలు, సీసీ కెమెరాల ఆధారిత నిఘా, సమగ్ర పోలీసింగ్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగిస్తున్నామని తెలిపారు .

## గూడెంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

- అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి,
- రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్న మల్లారెడ్డి



**ప్రజావాయిస్/కీసర :** బోనాల సందర్భంగా కీసర మండలంలోని గ్రామాలలో దేవాలయాలను దర్శించుకున్న మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి. బోనాల పండుగ సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కీసర మండలంలోని పలు దేవాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.వన్నిగూడ గ్రామంలో తొలిసారి బోనాలకు ఎమ్మెల్యే రావడంతో వన్నీగూడ ముదిరాజ్ సంఘం నాయకులు మల్లారెడ్డికి గణస్వాగతం పలికి ఘనంగా సన్మానం చేసారు. ఎమ్మెల్యే మల్లారెడ్డికి ముదిరాజ్ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, స్థానిక ప్రజలతో మాట్లాడి బోనాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కీసర మండల ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించింది:
- బీఆర్ఎస్ జిల్లా నాయకుల ... గౌడ్



**ప్రజావాయిస్ వేములపల్లి;** అర్హత ... క్కరికీ ఆసరా పెన్షన్లు మంజూరు చేయ... జిల్లా నాయకులు కట్టా మల్లేష్ గౌడ్ ... పల్లి మండలంలోని శెట్టిపాలెం గ్ర... రం ఏర్పాటు చేసిన విలేకరుల స... యన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ... చ్చిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరి... జూరు చేస్తామని హామీ ఇచ్చిందని, ... లోకి వచ్చిన తరువాత ఆ హామీలకు భిన్నంగా వ్యవహరిస్తూ ప్రజలను నిరాశకు గురిచేస్తోందని ఆరోపించారు. 32 నెలలుగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులను ప్రభుత్వం ఊరించి దగా చేసిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో 57 ఏళ్లు నిండిన వృద్ధులందరికీ, కుటుంబంలో ఎంతమంది అర్హులు ఉన్నా వారందరికీ పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం కొత్త పెన్షన్ల విషయంలో అర్హులకు అన్యాయం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరించినప్పటికీ, అర్హులైన వృద్ధులు, బీడీ కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, వృద్ధ కళాకారులకు తగిన ప్రాధాన్యం లభించకపోవడం బాధాకరమన్నారు.
వృద్ధాప్యంలో ఆసరాగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బీడీ కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, వృద్ధ కళాకారులు తదితర అర్హులకు పెన్షన్ అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి, ఎలాంటి వివక్షకు తావు లేకుండా కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ తరపున పోరాటం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ కాత్రగడ్డ రాజగోపాల్‌రావు, నక్క శ్రీధర్, రాచూరి రిషి, తంగేళ్ల సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ నాగరికతకు మూలం ఆదివాసీ సంస్కృతే!

- ఖమ్మం గిరిజన భవన్‌లో ఆదివాసీ దినోత్సవ వేడుకలు!
- గిరిజనాభివృద్ధికి నిధుల మంజూరుకు కట్టుబడి ఉన్నాం: వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాస్ నాయక్



**ప్రజా వాయిస్ ఖమ్మం:** ప్రకృతిని దైవంగా, అడవిని తల్లిగా భావిస్తూ తమ సంస్కృతి సంప్రదాయాలను తరతరాలుగా కాపాడుకుంటున్న, ప్రపంచ నాగరికతకు ఆదివాసీ సంస్కృతే మూలమని, ప్రకృతితో మమేకమైన వారి జీవన విధానం యావత్ మానవాళికి మార్గదర్శకమని పేర్కొన్నారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం గిరిజన భవన్‌లో ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర ఫిరంగి ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం అధికారికంగా ఘనంగా నిర్వహించారు.
కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులకు సకాలంలో చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజన బిడ్డలు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. గిరిజన పండుగలకు, ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.
టిఎస్టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వీరు నాయక్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత హక్కులు, గిరిజనుల సంక్షేమానికి అధికారులు ముందస్తు ప్రణాళికలతో పని చేయాలని, అన్ని గిరిజన తెగలను సమన్వయం చేస్తూ ముందుకు సాగాలని కోరారు.
ఈ వేడుకల్లో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు భూక్య వీరభద్రం, ఎఐబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి నాయక్, టిఎస్టిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మంగ్యా నాయక్, బద్రు నాయక్, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జోడేఘాట్‌లో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

- ఆదివాసీ చట్టాలు, హక్కులను పకడ్బందీగా అమలు చేయాలి
- తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడు కోట్నక విజయ్ కుమార్



**ప్రజా వాయిస్, ఉమ్మడి ఆదిలాబాద్ :** కొమురం భీం పోరాట గడ్డ జోడేఘాట్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడు కోట్నక విజయ్ కుమార్, కొమురం భీం మనువడు కుంరం సోనేరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా కొమురం భీం సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో కోట్నక విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి ఆగస్టు 9ను ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా గుర్తించడం గర్వకారణమన్నారు. అయితే ఆదివాసీ గ్రామాలు ఇప్పటికీ అభివృద్ధికి దూరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలు తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల విషయంలో వేధింపులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. 1/70, పిఇఎస్ఎ వంటి ఆదివాసీ రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదివాసీల హక్కులను పరిరక్షించకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, వాయిద్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాయకులు, ప్రజలు, మహిళలు, యువత సంప్రదాయ నృత్యాలతో ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ టైగర్ సేన, తుడుందెబ్బ, విద్యార్థి, మహిళా సంఘాల నాయకులు, పోరు గ్రామాల పటేళ్లు, దేవారీలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అపరిశుభ్రంగా ప్రభుత్వ కార్యాలయాలు..ఎక్కడ చుసిన అపరిశుభ్రమే...!!!

- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పిచ్చి మొక్కలే..
- ఈగలు, దోమలతో ప్రజలు ఇబ్బందులు..




**ప్రజా వాయిస్ టేక్మాల్ :** ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేసే ప్రభుత్వ అధికారులే తమ కార్యాలయాల పరిసరాలను నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టేక్మాల్ తహసీల్దార్ కార్యాలయం, రైతు వేదిక పరిసరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల వ్యవసాయ అధికారి కార్యాలయాల చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి, చెత్తాచెదారం పేరుకుపోవడంతో కార్యాలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి.కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఈగలు,దోమల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని ప్రజలు వాపోయారు.
ప్రతిరోజూ వందలాది మంది వివిధ పనుల కోసం ఆయా కార్యాలయాలకు వస్తుండగా, ఇలాంటి పరిస్థితులు వారికి అసౌకర్యం కలిగిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంగణంలో మరి అధ్వానంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో పిచ్చి మొక్కలు అధికంగా పెరగడం వల్ల దోమలు, ఈగల వల్ల ప్రజలకు సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అదేవిదంగా కార్యాలయాల పరిసరాలలో పాములు, విషపురుగులు సంచరించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు పరిశుభ్రతపై సూచనలు ఇచ్చే అధికారులు ముందుగా తమ కార్యాలయాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని, తక్షణమే పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రపరచాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.





## డిండిలో ఘనంగా జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజా వాయిస్ /డిండి :** డిండి మండల కేంద్రంలో ఆదివారం రోజున స్థానిక రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు గడ్డమీది సాయి ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల బాధ్యులు డిండి యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## కోదాడలో కవిత టీఆర్ఎస్ కదనభేరి.!

- మూడు మండలాలు.. గ్రామాల్లో కమిటీలకు కసరత్తు
- నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి: భూక్య సంజీవ్‌రావు
- కౌలు రైతులకు భరోసా.. మహిళలకు రూ.2,500 ఇవ్వాలని డిమాండ్

**ప్రజా వాయిస్, కోదాడ:** కోదాడలో కవిత టీఆర్ఎస్ కేడర్‌ను క్షేత్రస్థాయిలో కదిలించే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీని మండలం నుంచి గ్రామస్థాయి వరకు విస్తరించేందుకు కమిటీల ఏర్పాటుపై దృష్టి సారించింది. త్వరలో మూడు మండల కమిటీలతోపాటు గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం కోదాడ,అనంతగిరి రోడ్డులోని టీఆర్ఎస్ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు.సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య సంజీవ్‌రావు నాయక్ మాట్లాడుతూ.. అర్హులైన నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు ఇందిరమ్మ భరోసా అందించాలని, మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం చేయాలని కోరారు.గ్రామమే టార్గెట్.. కేడరే బలం అన్నట్టుగా పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేయాలని కార్యకర్తలకు సూచించారు.